ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5


శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 5 డిసెంబరు 2024





ఎర్రవాగులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన ఎర్రవాగు

- వాహన రాకపోకలకు అంతరాయం
- పల్లెలకు తెగిన సంబంధాలు

- వివరాలు 6లో



కావలి : బురదతో నిండిన బాలక్రిష్ణారెడ్డినగర్ రోడ్డు

నమ్మండి.. ఇది రోడ్డేనండి!

కాలు మోపితే సర్రుమనే జారే ఈ రోడ్డును చూశారా!? ఇదెక్కడో మారుమూల ప్రాంతంలోనిది కాదు.. కావలి మున్సిపాలిటీ పరిధిలోని పేదల కాలనీల రోడ్లు వర్షాలకు ఇలా బురదమయంగా మారాయి. బాలక్రిష్ణారెడ్డినగర్, ముసునూరు ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారులు సైతం బురదతో జర్రుబుర్రులాడుతున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు కూడా ఇక్కడకు రావడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరులో జేసీ మాల్ ప్రారంభం అనంతరం పట్టుచీరను ప్రదర్శిస్తున్న సినీ నటి ప్రియాంక మోహన్

వివరాలు 6

హిందువులపై దాడులు అమానుషం

- నెల్లూరులో హిందూ సంఘాల భారీ ర్యాలీ



నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండపై నిరసన తెలియజేస్తూ బుధవా రం సాయంత్రం నెల్లూరులో హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాయి. వీఆర్‌సీ మైదానం నుంచి గాంధీబొమ్మ, కనకమహల్, ఏసీ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ వద్దకు ర్యాలీ చేరుకుంది. సీనియర్ న్యాయ వాది పల్నాటి రామదండు మాట్లాడుతూ ఇస్కాన్ సిటీ కార్యనిర్వాహకుడు రామకృష్ణ దాసుపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం బంగ్లా ప్రభుత్వం ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. లలితా మహేశ్వర పీఠాధిపతి మహేష్‌స్వామి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పేరుగాంచిన ఇస్కాన్ సంస్థకు చెందిన కృష్ణదాస్ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు మానవ హక్కులను హరించడమేనని విమర్శించారు. ఈ ప్రదర్శనలో నాయకులు పీ సురేంద్రరెడ్డి, కర్నాటి అంజనేయరెడ్డి, రాజేశ్వరమ్మ, మిడతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే.. అందరూ బాగున్నారా!?

నగరంలో నటి ప్రియాంక మోహన్ సందడి

అట్టహాసంగా జేసీ మాల్ ప్రారంభం

నగరంలో జేసీ మాల్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఇందులో పాల్గొన్న నటి ప్రియాంక మోహన్ 'నమస్తే అందరూ బాగున్నారా!?' అంటూ అభిమానులను ఆప్యాయంగా పలకరించారు.

కావలి మున్సిపాలిటీపై

'అమృత్' భారం

నాటి వైసీపీ సర్కారు పాపం కావలి పురపాలక సంఘాన్ని వెంటాడుతూనే ఉంది. పట్టణవాసుల దాహం తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్' పథకం ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.29 కోట్లు నాటి వైసీపీ పెద్దలు మంజూరు చేయకపోవడంతో మున్సిపాలిటీనే బ్యాంకులో రుణం తీసుకుని చెల్లించింది. ఇప్పటిదాకా 90 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలకు మంచినీరు మాత్రం అందడంలేదు. అదీనూగాక బ్యాంకు నుంచి తెచ్చిన రుణానికి ఈఎంఐ చెల్లింపులు గుదిబండగా మారాయి. ఇక అమృత్-2 కింద రూ.50 కోట్లు మంజూరవగా, ఆ నిధులు అందకనే ఆర్థిక సంఘం నిధులను మినహాయించుకోవడం మున్సిపల్ ఖజానాను కుంగదీస్తోంది.

- రూ.100 కోట్లలో 52 కోట్ల ఖర్చు
- తన వాటా చెల్లించని నాటి వైసీపీ సర్కారు
- రూ.29 కోట్ల బ్యాంకు రుణం ద్వారా ఇచ్చిన పురపాలకం
- ఇందుకు ఈఎంఐ రూ.35 లక్షలు
- మలివిడతలో మరో రూ.50 కోట్ల మంజూరు
- నిధులు రాకనే ఆర్థిక సంఘం ఫండ్ నుంచి కట్
- అయినా పురవాసులకు అందని నీరు



నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని ఓవర్‌హెడ్ ట్యాంకు

కావలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కావలి పురపాలక సంఘానికి అమృత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఆనందం కన్నా ఆ నిధులలో తన వాటా చెల్లించడం పురపాలక సంఘానికి ఆర్థిక భారమైంది. అమృత్ పథకం కింద పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుదలకు, మురుగునీరు శుద్ధి చేసేందుకు రూ.100 కోట్లు గతంలో మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన మంచినీటి ప్రాజెక్ట్ ఇంకా వినియోగంలోకి రాకున్నా అమృత్ వాటా చెల్లింపులకు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు ప్రతినెలా రూ.35 లక్షలు ఈఎంఐ కింద కట్టాలి. ఇక అమృత్-2 కింద బలహీనవర్గాల కాలనీలకు మంచినీటి సరఫరాకు, మురుగునీటి శుద్ధికి మరో రూ.50 కోట్లు మంజూరయ్యాయి. అయితే ఆ నిధులతో ఇంకా పనులు చేపట్టలేదు. నిధులూ రాలేదు. కానీ మున్సిపల్ వాటా కింద 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వమే మినహాయించుకుంది. నిధులు ఇవ్వకుండానే మున్సిపల్ వాటా కింద ముందుగానే తీసుకోవడం ఏమిటనే చర్చ ఇప్పుడు విస్తృతంగా నడుస్తోంది.

● నాటి వైసీపీ సర్కారు పాపం

వాస్తవంగా అమృత్ పథకం కింద కేంద్రం మంజూరు చేసిన నిధులలో 50 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుండగా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 10 శాతం మున్సిపాలిటీ భరించాలి. అయితే తొలుత మంజూరు చేసిన రూ.100 కోట్లలో 10 శాతం వాటా కింద మున్సిపాలిటీ రూ.10 కోట్లు మాత్రమే చెల్లించాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా సక్రమంగా ఇవ్వక పోవటంతో మున్సిపాలిటీయే బ్యాంకు నుంచి రూ.29 కోట్ల రుణం తెచ్చి చెల్లించింది. అయితే ఆ రుణానికి ప్రతినెలా ఈఎంఐ కింద బ్యాంకుకు రూ.35 లక్షలు చెల్లించాల్సి ఉండటంతో మున్సిపాలిటీకి ఆర్థిక భారమైంది.

● పురవాసులను తీరని దాహం

అమృత్ పథకం తొలివిడత మంజూరైన రూ.100 కోట్లలో రూ.52 కోట్లతో మంచినీటి ప్రాజెక్ట్ పనులు చేపట్టారు. సుమారు 175 కి.మీ పొడవున పైపులైన్ నిర్మించాల్సి ఉండగా దానిని కుదించి 75 కి.మీ పైపులైను నిర్మాణంతో సరిపెట్టారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు పైపులైన్ల నిర్మాణంచేలా డిజైన్ చేసినా క్షేత్రస్థాయిలో అలా జరగలేదు. ఆ పైపులైన్ల పరిధిలో బలహీన వర్గాలకు 7,500 కొళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా 3,500 కనెక్షన్లు ఇచ్చేందుకు కూడా సరిపడా పైపులైన్ల విస్తరణ జరగలేదు. మరోవైపు ఆరు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో ఒక్క బుడంగుంట కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు తప్ప మిగిలిన ఐదు వినియోగంలోకి రాలేదు. ఒక జీఎల్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించినా దానిని వినియోగంలోకి తేలేదు. సమ్మర్‌స్టోరేజి ట్యాంకు వద్ద నిర్మించిన ఫిల్టరేషన్ పాయింట్‌ను కూడా పూర్తిగా వినియోగంలోకి తేలేదు. మొత్తమ్మీద అమృత్ పథకం కింద 90 శాతం పనులు పూర్తయినట్లు బిల్లులు చేసి రూ.50 కోట్లు వెచ్చించినా ఇంకా దాని ద్వారా నీటి సరఫరా జరగలేదు. వాస్తవంగా అమృత్‌పథకం పూర్తిగా వినియోగంలోకి వస్తే పట్టణంలో ఏ మారుమూల ప్రాంతంలో కూడా తాగునీటి ఎద్దడి అనేది ఉండదు. ప్రస్తుతం వినియోగంలోకి రానందున ప్రతినెలా తాగునీటి ట్యాంకర్లకు రూ.10 లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ఒక పక్క తాగు నీటి ట్యాంకులకు, మరోపక్క అమృత్ రుణం ఈఎంఐలకు మున్సిపల్ నిధులు వెచ్చించాల్సి రావటంతో ఆర్థిక భారం పెరిగి మున్సిపాలిటీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటోంది.



ముసునూరు ఇందిరమ్మ కాలనీలో అసంపూర్తిగా పైపులైన్

నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగంలో మరో భారీ అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ట్రేడ్ లైసెన్సుల పేరిట కార్పొరేషన్‌కు చెందాల్సిన నిధులను పెద్ద మొత్తంలో అధికారులు స్వాహా చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్య విభాగం రికార్డుల్లో 13,383 ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు చూపగా రెవెన్యూ విభాగం మాత్రం 26 వేల కమర్షియల్ అసెస్‌మెంట్లకు పన్ను విధిస్తున్నట్లు లెక్కల్లో తేల్చింది. మరి మిగిలిన ఆ 12,617 ట్రేడ్ లైసెన్సులు ఎక్కడున్నాయి...? వాటి ద్వారా వస్తున్న ఆర్థిక లబ్ధి ఏ ఖాతాల్లో జమవుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

- నెల్లూరు కార్పొరేషన్‌లో రికార్డులకెక్కని వాణిజ్య లైసెన్సులు
- 26 వేల కమర్షియల్ అసెస్‌మెంట్లకు పన్ను
- ట్రేడ్ లైసెన్సులు 13,383 మాత్రమే
- మిగిలిన 12,617పై తేలని లెక్క
- నగర పాలిక ఖజానాకు రూ.కోట్లలో గండి
- శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల చేతివాటంపై అనుమానం

ట్రేడ్ మాయ





నెల్లూరు(సిటీ), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో వాణిజ్య, వ్యాపారాలకు కార్పొరేషన్ నుంచి తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు పొందాలి. వీటిని మున్సిపల్ ఆరోగ్య విభాగం పర్యవేక్షిస్తుంది. నగరంలోని 166 డివిజన్ సచివాలయాల పరిధిలో నివాసాలుకాక వాణిజ్యపరంగా 13,383 భవనాలున్నట్లు ఆ విభాగం లెక్క కట్టింది. వీటి నుంచి ట్రేడ్ లైసెన్సుల రూపేణ గడిచిన పదేళ్లలో కార్పొరేషన్ ఖజానాకు రూ.28.60 కోట్లు చేరాలని, ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో మరో రూ.4.27 కోట్లు కలిసి మొత్తంగా రూ.32.88 కోట్లు నగర పాలక సంస్థకు వసూలు కావలసి ఉందని రికార్డుల్లో నమోదు చేసింది. ఈ మొత్తం బకాయిలో రూ.14.82 కోట్లు వసూలు చేయగా ఇంకా రూ.18.06 కోట్లు రావాల్సి ఉందని నిర్ధారించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే, నగరంలో 13,383 మాత్రమే వాణిజ్య పరమైన భవనాలు న్నట్లు ఆరోగ్య విభాగం కరాకండిగా చెబుతోంది. కానీ, రెవెన్యూ విభాగం మాత్రం 26 వేల వాణిజ్యపరమైన భవనాలున్నట్లు తేల్చి వాటికి అసెస్‌మెంట్లను జారీ చేసి పన్ను కూడా విధించింది. ఆ మేరకు పన్ను వసూళ్లు కూడా జరుగుతున్నాయి. ఈ రెండు విభాగాల మధ్య ఇంతటి భారీ వ్యత్యాసం ఎలా వచ్చింది...? అన్నది కార్పొరేషన్ యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. రెండు విభాగాల మధ్య స్వల్ప వ్యత్యాసాలుండటం సహజం. కానీ, రెండింతలకుపైగా తేడా ఉండటంపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆ 12 వేల లైసెన్సులు ఎక్కడ?

ఆరోగ్య విభాగం లెక్కల్లో చూపని సుమారు 12 వేల ట్రేడ్ లైసెన్సులు ఎక్కడున్నాయి?, వాటి ద్వారా వచ్చే ఆదాయం ఎవరికి చేరుతోంది?, ఎంత మేర వసూలవుతోంది? అన్నది కార్పొరేషన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అధికారికంగా ప్రకటించిన 13వేల లైసెన్సుల ద్వారానే కార్పొరేషన్‌కు పదేళ్లలో రూ.28.60 కోట్లు వస్తే మరి, లెక్కల్లో చూపని 12వేల లైసెన్సుల ద్వారా కార్పొరేషన్‌కు చేరాల్సిన ఎన్ని కోట్ల రూపాయలకు గండి పడిందో అర్థం చేసుకోవచ్చు.

అధికారులు, సిబ్బంది చేతివాటంపై అనుమానాలు

కార్పొరేషన్ ఆరోగ్య విభాగం నుంచి క్షేత్ర స్థాయిలో కీలకంగా పని చేసే శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రేడ్ లైసెన్సుల విధింపు, వసూళ్ల బాధ్యత వారిదే. ఈ నేపథ్యంలో రికార్డుల్లో చూపని 12 వేల వాణిజ్య కేంద్రాల నుంచి అనధికారి కంగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ మొత్తం సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్ల జేబులోకి చేరుతున్నట్లు అనుమానాలున్నాయి. నగరమంతా సర్వే చేస్తే వాస్తవాలు వెలుగులోకి రావడమేకాక వాణిజ్య భవనాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రైల్వేలో 'గుర్తింపు' సందడి



నెల్లూరులోని పోలింగ్ కేంద్రం వద్ద యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన శిబిరాలు

- 11 ఏళ్ల తర్వాత యూనియన్ ఎన్నికలు
- రెండు రోజులపాటు పోలింగ్.. నేటితో ముగియనున్న ప్రక్రియ
- 12న ఫలితాల వెల్లడి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారతీయ రైల్వే శాఖలో 11 ఏళ్ల తర్వాత కార్మిక యూనియన్ గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని నాలుగు రైల్వేస్టేషన్లలో సందడి నెలకొన్నది. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించేందుకు యునియన్ల వ్యవస్థ ఎప్పటినుంచో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి యునియన్ గుర్తింపు ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతాయి. అయితే, 2013లో ఎన్నికలు జరగ్గా 2018లో తిరిగి ఎన్నికల జరగాల్సి ఉండగా కేంద్రం అనుమతించలేదు. 11ఏళ్ల తర్వాత ప్రస్తుతం కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైల్వే కార్మిక యునియన్ల గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గూడూరు డివిజన్ పరిధిలో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, గూడూరుతోపాటు కృష్ణపట్నం స్టేషన్‌లతోపాటు బిట్రగుంట డివిజన్ పరిధిలోని బిట్రగుంట స్టేషన్‌లో బుధ, గురువారాలలో పోలింగ్ జరగనుంది. గూడూరు డివిజన్‌లో సుమారు 950 మంది, బిట్రగుంట డివిజన్‌లో 850 మంది కార్మికులు, ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తొలిరోజున గూడూరు డివిజన్‌లో 527 మంది, బిట్రగుంట డివిజన్‌లో 314 మంది ఓటు వేశారు.

● బరిలో ఐదు యూనియన్లు

ప్రధానంగా రైల్వేశాఖలో ఐదు ప్రధాన యునియన్లు అయిన రైల్వే మజ్దూర్ యునియన్, సౌత్ సెంట్రల్ ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ మజ్దూర్ యునియన్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం, ఇండియన్ రైల్వే మజ్దూర్ యునియన్‌లు పోటీలో ఉన్నాయి. ఈ నెల 12వ తేదీన ఫలితాలు వెలువడ నున్నట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. మొత్తం పోలైన ఓట్లలో 30 శాతం వచ్చిన యూనియన్‌కు కేంద్ర ప్రభుత్వ 'గుర్తింపు' ఉంటుంది. కార్మిక సమస్యలపై సదరు యూనియన్ నాయకులే కేంద్రంతో చర్చించే అవకాశం ఉంటుంది.



దారి దుస్థితి చూడు.. దత్తాత్రేయా...!

మండలంలోని మొగిలిచెర్ల నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దత్తాత్రేయ స్వామి గుడికి వెళ్లే రోడ్డు కురుస్తున్న వర్షాలకు బురదమయమైంది. దీంతో ఆలయానికి వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. సుమారు 3 కి.మీ దూరం రోడ్డంతా ఇలాగే ఉంది. స్వామి దర్శనానికి వెళ్లే భక్తులు కూడా అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

తెల్లవారుజామున చెంచయ్య అనే వ్యక్తి బహిర్భూమికి వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న కొండచిలువను చూడకుండా దానిపై కాలుపెట్టి జారీ కిందపడ్డాడు. కొండచిలువను గమనించి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని చంపేందుకు ప్రయత్నించారు. అయితే, అది ఓ ట్రాక్టర్‌లోకి దూరిం ది. దాదాపు గంట సేపు హడావుడి అనంతరం కొండ చిలువను హత మార్చారు. భారీ సైజులో ఉన్న కొండచిలువను గ్రామస్థులు ఆసక్తి కరంగా చూశారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)



వామ్మో.. ఎంత పేద్ద కొండచిలువో!

రోడ్డు ఇలా... ప్రయాణం ఎలా?

నెల్లూరు - జొన్నవాడ మార్గంలో పొట్టేపాళెం వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఏడాదికిపైగా ఇక్కడి కలుజుపై నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇది ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మాత్రమే ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు. అయితే కార్లు, జీపులు కూడా దీనిపైనుంచే వెళ్లడంతో గుంతలుపడి ప్రమాదాలకు హేతువుగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బిక్కు బిక్కుమంటూ వెళ్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇక్కడి రోడ్డును ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



ఇంటి పంట.. భలే రుచులంట!

• విస్తరిస్తున్న మిద్దెతోటలు

ఇంటి ఆవరణలో అదీ గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన పెరటి తోటలు ఇప్పుడు నగరాలకూ విస్తరించాయి. యాంత్రిక జీవనం నుంచి బయట పడేందుకు పచ్చని మొక్కల మధ్య ఆహ్లాదంగా గడిపేందుకు ఇంటి ఆవరణలో, మిద్దెలపైన వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. పండ్లు, పూలు, కాయగూరలు, ఆకుకూరలు, ఆయుర్వేదం, ఫ్యాషన్ మొక్కలు ఇలా ఎన్నో రకాల మొక్కలను పెంచుతున్నారు. ఒకరితో మొదలైన ఈ 'మిద్దె తోటలు' సామాజిక మాధ్యమాల ద్వారా బాగా విస్తరించాయి. తోటలపై తమ అభిరుచులను పంచుకునేందుకు, సూచనలు, సలహాలు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఒకరినొకరు పంచుకుంటున్నారు. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌కు చెందిన గోపిశెట్టి సందీప్ తన ఇంటి మిద్దెపై మొక్కలను పెంచడమేగాక రకరకాల మొక్కలను స్నేహితులకు, సన్నిహితులకు ఇచ్చుపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)











నగరంలోని భక్తవత్సలనగర్‌కు చెందిన గోపిశెట్టి సందీప్‌కు చిన్ననాటి నుంచే కాయగూరలు, పూలు, పండ్ల మొక్కలు పెంపకంపై ఆసక్తి ఉంది. ఇంటి పరిసర ప్రాంతాల్లో తోటల పెంపకంలో తన తండ్రికి సహకరించేవారు. చేతికొచ్చిన పండ్లు, కూరగాయలను బంధువులు, స్నేహితులకు పంచేవారు. బీటెక్ చదువుతన్న సమయంలోనే సందీప్ రెండు, మూడు సార్లు వివిధ రకాల పూలు, కూరగాయల, పండ్ల మొక్కలను పెంచేందుకు ఆసక్తి చూపినా మెలకువలు తెలియక విఫలమ య్యారు. ఆ తరువాత వ్యాపార నిమిత్తం పూణెలో ఉన్నప్పుడు ఇంటి దగ్గర తల్లి వంటకు అవసరమైన కూరగాయలు తీసుకొచ్చేందుకు ఇంటి నుంచి చాలా దూరం వెళ్లాల్సి రావడం, పడుతున్న ఇబ్బందులు సందీప్‌ను కాస్త ఇబ్బంది పెట్టాయి. దీంతో మిద్దె తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలపై దృష్టి పెట్టారు. తెలిసిన రైతులు, యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా 2019లో ఇంటి మరమ్మతులతోపాటు మిద్దె తోటల పెంపకానికి అవసరమైన తొట్టెలు, పందిరులు ఏర్పాటు చేసుకున్నారు. అంతేగాక కారు టైర్లు, వాటర్ క్యాన్లు, పీవీసీ పైపులతో చిన్నపాటి కుండీలను ఏర్పాటు చేసి వివిధ రకాల పూలు, పండ్లు, కూరగాయలతోపాటు ఆయుర్వేద మొక్కలను పెంచడం ప్రారంభించారు. మొక్కలకు అవసరమైన ఎరువును సైతం తయారు చేసుకుంటున్నారు. మామ్స్ టెర్రస్ గార్డెన్ అని పేరు కూడా పెట్టుకున్నారు.

వాట్సప్ గ్రూపులో...

మిద్దె తోటల పెంపకం ప్రారంభించిన కొత్తల్లో తనకు తెలిసిన నలుగురితో వాట్సాప్ గ్రూపును ప్రారంభించారు సందీప్. ప్రస్తుతం రెండు గ్రూపులు ఉండగా అందులో దాదాపు 480 మంది సభ్యులు ఉన్నారు. నెలకొకసారి సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సమావేశాల్లో ఒకరికొకరు పండ్లు, కూరగాయలతోపాటు ఖరీదైన ఎడారి, షోకేస్ మొక్కలు ఉచితంగా ఇచ్చిపుచ్చుకుంటున్నారు. అంతేగాక మొక్కలు పెంచుకునేందుకు అవసరమైన టబ్బులు కూడా అందించుకోవడం విశేషం. మిద్దె తోటల పెంపకాన్ని గుర్తించిన రైతు నేస్తం ఫౌండేషన్ 2022లో సందీప్‌కు అవార్డు కూడా అందించి ప్రోత్సహించింది.

పెంచుతున్న మొక్కలు

అలువేరా, మల్టీవిటమిన్, నేల ఉసిరి, వాము, లెమన్ గ్రాస్, కొండపిండాకు, పెన్సిల్ కాక్టస్, ఇన్సులిన్ ప్లాంట్, పుదీనా, మునగ వంటి ఆయుర్వేద మొక్కలను పెంచుతున్నాను. అలాగే ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, అంజీర, సీతాఫలం, దానిమ్మ వంటి పండ్లమొక్కలు, గోంగూర, ఆకుకూరలు, వంగ, బెండ, బీన్స్, గుత్తిబీర, కరివేపాకు తదితర ఇంటికి అవసరమైన కూరగాయల మొక్కలు పెంచుతున్నాను. ఎడారి షోకేస్ మొక్కలు అడేనియం, బోన్సే కాక్టస్, సెకలెన్స్‌లతోపాటు రణపాల, క్రోటాన్ వంటి మొక్క లతో తోట ఎంతో అందంగా ఉంటోంది.



ఇంట్లోనే ఎరువుల తయారీ

మిద్దె తోటల పెంపకానికి అవసరమైన ఎరువులు స్వయంగా తయారు చేసుకుంటాను. మట్టి, ఎండి రాలిపోయిన ఆకులు, మొక్కలు, ఆవుపేడ, గోమూత్రంతో మొక్కలకు అవసరమైన ఎరువును సిద్ధం చేసుకుంటాను. ఫిష్ పాండ్‌లో ఉండే నీటిని కూడా ఎరువులుగా వినియోగిస్తాను. ఉద్యోగ రీత్యా బయట ఎక్కువ తిరుగుతుంటాను. అయినా వారంలో ఒకరోజు పూర్తిగా మిద్దె తోటలకు కేటాయిస్తాను. ఎక్కువ సమయం ఇక్కడే గడుపుతాను.

- గోపిశెట్టి సందీప్

- పండ్లు, కూరగాయలు, పూల పెంపకం
- ఫ్యాషన్ మొక్కలకూ చోటు
- వాట్సప్ గ్రూపుల్లో అనుభవాల షేరింగ్
- మానసిక ఉల్లాసానికి ఇవే బెటర్ అంటున్న పెంపకందారులు





ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్పొరేషన్ కార్మికులు

టిడ్కో సముదాయం శుభ్రం

- ప్రత్యేక బృందాలతో చెత్త, ముగురు తొలగింపు
- స్థానికుల హర్షం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు లోని వెంకటేశ్వరపురంలో ఉన్న టిడ్కో గృహ సముదాయం ఎట్టకేలకు శుభ్రపడింది. టిడ్కో నివాసాల వద్ద పారిశుధ్య పరిస్థితులపై 'చెత్తకుప్పలు.. మురుగు కంపు' శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో కార్పొరేషన్ యంత్రాంగం కదిలింది. ప్రత్యేకంగా కార్మిక బృందాలను ఏర్పాటు చేసి పిచ్చి మొక్కలను, మురుగు, వ్యర్థాలను తొలగించారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లారు అనేక నెలలుగా ఉన్న సమస్యలు పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పోటెత్తిన వరద.. ఉప్పొంగిన ఎర్రవాగు

కందుకూరు మండలంలో మోపాడు చెరువు నిండటంతో మంగళవారం రాత్రి తలుపులు ఎత్తి వరదనీటిని వదిలారు. బుధవారం ఉదయానికి పంది వాగు నుంచి వరద ఉధృతి పెరగడంతో ఒకదశలో పదిగేట్లు ఎత్తారు. దీంతో కందుకూరు - గుడ్లూరు మార్గం, కందుకూరు - చుట్టుగుంట మార్గంలోని ఎర్రవాగు పొంగి ప్రవహించటంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎర్రవాగులో ఆర్టీసీ బస్సు అదుపుతప్పడంతో ప్రయాణికుల్లో భయాందోళన నెలకొంది. బస్సు పూర్తిగా పక్కకు వెళ్లడంతో అత్యవసర ద్వారం నుంచి ప్రయాణికులు బయటపడ్డారు. చుట్టుగుంట మార్గంలో ఆటోలు, మోటారుసైకిళ్లు ప్రయాణించే వీలు లేకపోవటంతో ఉలవపాడు, ఆత్మకూరు, మన్నేటికోట, కుమ్మరిపాలెం, చుట్టుగుంట తదితర గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. అత్యవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలలో పది కిలోమీటర్లకుపైగా చుట్టూ తిరిగి కందుకూరు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

రేపు కళా ఉత్సవ్ పోటీలు

ఇందుకూరుపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్నీ యాజమాన్యాల పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. గాత్ర సంగీతం (సాంప్రదాయ, జానపద, భక్తి, దేశభక్తి), వాయిద్య సంగీతం, (సంప్రదాయ, పెర్కసివ్, మెలోడి, ఆర్కెస్ట్రా) నాట్యం (సాంప్రదాయం, జానపదం), దృశ్యకళలు (ద్విమితీయ చిత్రణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, అద్దకం, వ్యంగ్యచిత్రం, క్యారికేచర్, త్రిమితీయ చిత్రణ- శిల్పం, నమూనా, సాంప్రదాయబద్ధ ఆటబొమ్మలు, ఆటలు, చేతిపనులు), రంగస్థలం (ఏకపాత్రాభినయం, ధ్వన్యనుకరణ, నాటిక, నాటకం), సాంప్రదాయ కథలు చెప్పడం, నృత్యం, నాటకం, సంగీత) పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి విభాగం నుంచి వ్యక్తిగతంగానూ, ఐదుగురి బృందంతోనే పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. ఒక్కొక్క విద్యా సంస్థ నుంచి ఒక్కొక్క కళారూపంలో విద్యార్థి లేక విద్యార్థిని మాత్రమే విడివిడిగా పాల్గొనాలన్నారు. గత ఏడాది జరిగిన కళా ఉత్సవ్‌లో బహుమతులు సాధించినవారు పోటీకి అనర్హులని తెలిపారు. విద్యార్థులు వారికి అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలన్నారు. ప్రతి కళారూప ప్రదర్శనకు ఐదునిముషాలు మాత్రమే సమయం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనేవారు తమ వివరాలను డైట్ కళాశాల మెయిల్‌కు పంపాలని ఆయన తెలిపారు.

నమస్తే.. అందరూ బాగున్నారా!?

• నగరంలో నటి ప్రియాంక మోహన్ సందడి • అట్టహాసంగా జేసీ మాల్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నమస్తే నెల్లూరు బాగున్నారా.. అంటూ యువతను కేరెత్తించిన నటి ప్రియాంక మోహన్ బుధవారం నెల్లూరులో నూతన వరవడికి నిత్య నూతన ఫ్యాషన్లకు నిలయమైన జేసీ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసింది. ముందుగా మాల్ ముందు స్టేజీ మీద తన కోసం వచ్చిన అభిమానులను ఆప్యాయంగా పలకరించింది. దీంతో అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది. అనంతరం నెల్లూరు రూరల్, కోవూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కార్పొరేటర్ దాసరి అమృతలతో కలిసి జేసీ మాల్‌ను ప్రారంభించారు. మాల్‌లోని అన్ని ఫ్లోర్లను తిరిగి వస్త్రాలను ప్రదర్శించారు. అనంతరం నటి ప్రియాంక మోహన్ విలేకరులతో మాట్లాడుతూ జేసీ మాల్ అంటే ఫ్యాషన్ ఫర్ ఆల్ అంటూ కితాబిచ్చారు. కుటుంబం మొత్తానికి కావాల్సిన వస్త్రాలు వేలాది రకాలు ఇక్కడ ఉన్నాయి. ప్రారంభ ధర రూ.99లేనంటూ తెలిపారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని నిత్యనూతన డిజైన్ల వస్త్ర ప్రపంచాన్ని తలపిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో వ్యాపారంలో ఎదిగి మరిన్ని షాపింగ్ మాల్‌లు ప్రారంభించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అతిథులను జేసీ మాల్ అధినేత ఎం.జనార్థన్ రెడ్డి, జమునారెడ్డి దంపతులు, డైరెక్టర్ కృష్ణారావు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం షాపింగ్‌మాల్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది.



జేసీ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటి ప్రియాంక మోహన్, ఎమ్మెల్యేలు ప్రశాంతి, శ్రీధర్‌రెడ్డి తదితరులు



జేసీ మాల్‌లో కొనుగోలుదారుల సందడి

'సోమశిల'లో 71 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నీటినిల్వ పెరుగుతోంది. బుధ వారం 9,578 క్యూసె క్కుల ఇన్‌ఫ్లో ఉండగా 71.119 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తు న్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం నీటిమట్టం 15.5 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి 380 క్యూసెక్కుల వరద ప్రవా హం జలాశయానికి వస్తున్నట్లు తెలిపారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీకి వస్తున్న వరద నిలకడగా ప్రవహిస్తోంది. వర్షం కారణంగా వాగులు, వంకలు ప్రవహించి బీరాపేరు, బొగ్గేరు ద్వారా సుమారు ఆరు వేల క్యూసెక్కుల నీరు బ్యారేజీకి చేరుతున్నాయి. దీంతో నీటిమట్టం 11.1 అడుగులు చేరిం ది. కావలి కాలువకు 500 క్యూసెక్కులు, కనిగిరి రిజర్వాయర్‌కు 350 క్యూసెక్కులు, నెల్లూరు చెరువుకు 50 క్యూసెక్కులు, నెల్లూరు తాగునీటికి 50 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని బ్యారేజీ గేట్ల ద్వారా దిగువ నెల్లూరు బ్యారేజీకి విడుదల చేస్తున్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతం 54 టీఎంసీల నీరు ఉన్నట్టు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 3,650 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 980 క్యూసెక్కులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం నీటినిల్వ 18.8 అడుగులు ఉంది. మన్నేరు ఎగువ నుంచి 220 క్యూసెక్కులు, సోమశిల ఉత్తర కాలువ నుంచి 130 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.

కలెక్టరేట్‌లో ఐటీడీఏ ఆధార్ కేంద్రం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాల య ఆవరణలో ట్రెజరీ కార్యాలయం వెనుక వైపు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఒక ఆధార్ కేంద్రం గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఉండగా తాజాగా కలెక్టరేట్‌లో కూడా అలాంటి కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిమళ పేర్కొన్నారు. గిరిజనులతోపాటు అందరూ ఈ కేంద్రాన్ని వినియోగించుకునే అవకాశం కల్పించారు.



సంగం తహసీల్దారు కార్యాలయానికి ఏర్పాటుచేసిన ఆయిల్ జనరేటర్ నిరుపయోగంగా మారింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు తహసీల్దారు కార్యాలయంలో ఆన్‌లైన్ సర్వీసులు ఆగిపోకుండా కొనసాగించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి జనరేటర్‌ను ఏర్పాటుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయిల్ ఖర్చులు భరించలేక జనరేటర్ వినియోగించకుండా నిరుపయోగంగా మార్చారు. విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం కలిగితే కంప్యూటర్లు, ప్రింటర్ పనిచేయక సేవలు నిలిచిపోతున్నాయి. వివిధ సర్టిఫికెట్‌ల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనరేటర్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

రూ.లక్షలు పోసి..
ముళ్లపొదల్లో తోసి

ఇంకా నిద్రపోతే ఎలా!?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కొందరు అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదు. వైసీపీ భ్రమలోనే కాలం గడుపుతున్నారు. అనంతసాగరం మండలంలోని మినగల్లు బస్టాండ్ సెంటర్‌లో అందరికీ కనిపించేలా గత ప్రభుత్వంలో జగన్ ఫొటోతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బోర్డు బాహాటంగా కనిపిస్తున్నా దాన్ని తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

పెంచులోరి ఆదాయం రూ.79 లక్షలు

రాపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన ఆలయ హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. మొత్తం రూ.79,66,645 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. లెక్కింపులో ఉపకమిషనర్, కార్యనిర్వహణ అధికారి, ప్రధాన అర్చకులు, పెంచలకోన ఔట్‌పోస్టు పోలీసులు, జిల్లా ఎస్‌బీఐ బ్యాంకు రిటైర్డ్ అసోసియేషన్ నెల్లూరువారు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్, బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ద్వారా వచ్చిన నగదు మొత్తాన్ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పెంచలకోన బ్రాంచ్‌కు జమ చేసినట్లు ఈవో తెలిపారు.



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా
సేవలు అందించాలి

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి ● నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ కృష్ణకాంత్



ట్రాన్స్‌జెండర్ హత్య కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబుకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణం స్పందించి పోలీసు శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో బుధవారం నెల వారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ రకాల కేసులు, వాటి దర్యాప్తులో పురోగతిని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ కేసుల సత్వర పరిష్కారానికి దృష్టి సారించాలన్నారు. మిస్సింగ్ కేసుల ఛేదన, ఇతర తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని స్పష్టం చేశారు. పీజీ ఆర్‌ఎస్ పిటీషన్లకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ఈ నెల 14న జరగనున్న మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారు మళ్లీ నేరాలకు పాల్పడుతుంటే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ సందర్శన, పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని, ప్రధాన కూడళ్ళు, వ్యాపార సముదాయాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ చూపి కేసులను ఛేదించిన అధికారులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు సీహెచ్ సౌజన్య, జీ మునిరాజ, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పల వేషధారణతో బురిడీ

● బంగారం ఆభరణాలతో పరారీ

అల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పమాలతో వచ్చిన ముగ్గురు మీ ఇంట్లో దెయ్యాలు ఉన్నాయంటూ నమ్మబలికారు... అవి పోవాలంటే పూజలు చేయాలని చెప్పారు.. అనంతరం బంగారంతో పరారయ్యారు... ఈ సంఘటన అల్లూరులో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు గుంటక శ్రీనివాసులు కథనం మేరకు, అల్లూరు దళితవాడకు అయ్యప్ప మాలధారణతో ముందుగా ఒకరి ఇంటికి వెళ్లి మీ వద్ద ఉన్న బంగారాన్ని రెట్టింపు చేస్తామని చెప్పారు. ఆ వ్యక్తి వారి మాటలకు ఆగ్రహించి ముందు మీరు ఇంట్లో నుంచి వెళ్లమని గదగాయించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయినవారు శ్రీనివాసులు ఇంటికి వెళ్లారు. మీ ఇంట్లో దెయ్యాలు ఉన్నాయి. వాటి వల్ల మీకు ప్రమాదం పొంచి ఉందని నమ్మించారు. వారి మాటలు నమ్మిన శ్రీనివాసులు వారిని ఇంట్లోకి తీసుకెళ్లారు. పూజలు చేయాలని శ్రీనివాసులును కూర్చోపెట్టి అతడి వద్ద ఉండే 3 సవర్ల బంగారు ఉంగరాలు, చైన్‌ను తీసి పక్కన పెట్టాలని కోరారు. వాటిని కూడా రెట్టింపు చేస్తామని చెప్పారు. వారి మాటలు నమ్మి బంగారాన్ని అక్కడ పెట్టాడు. ఏవో మంత్రాలు చదివి ఇంటిలో ఉండే సాయిబాబా పటం దగ్గరకు వెళ్లి కళ్లుమూసుకొని నిల్చోవాలని, తాము చెప్పేంతవరకు వెనక్కి తిరిగి చూడవద్దని చెప్పారు. వారి మాటలను ఆలకించిన శ్రీనివాసులు 10 నిమిషాల వరకు కళ్లు మూసుకునే ఉన్నాడు. ఎంతకీ వారి నుంచి అనుమతి రాకపోవడంతో కళ్లు తెరచి చూడగా, ముగ్గురు అక్కడ కనిపించలేదు. బంగారు ఆభరణాలు కూడా కనిపించలేదు. దీంతో మోసపోయానని భావించిన శ్రీనివాసులు చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వగా, వారి కోసం అల్లూరంతా గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఎక్స్‌కవేటర్ చోరీ, ఇప్పుడు ఈ ముగ్గురి దోపిడీతో ఏంజరుగుతుందో తెలియక పట్టణవాసులు ఆందోనలో ఉన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం స్వాధీనం



చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్

కోవూరు, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి మండల పరిధిలోని ఇనమడుగుకి బుధవారం చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని ఎస్‌ఐలు రంగనాథ్ గౌడ్, ఖదీర్ బాష పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... చెన్నై నుంచి లారీలో తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా ఉమ్మిపెడ గ్రామానికి చెందిన అన్నాతమ్ముళ్లు ప్రశాంతకుమార్, నాగరాజు చికెన్ వ్యర్థాలను ఇనమడుగు పరిసర ప్రాంతాల్లోని చేపల గుంతలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిద్దరూ చాలాకాలంగా చికెన్ వ్యర్థాలను లారీలో జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. వారిని అరెస్టు చేసి లారీని స్వాధీనపరచుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భార్యను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన మస్తాన్ కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి కావలి మార్గంలోని ఎస్టీ కాలనీలో మస్తాన్ అనే వ్యక్తి తన భార్య ఇందిరను విచక్షణారహితంగా కత్తితో పొడిచి హత్య చేసి పరారైన విషయం తెలిసిందే. కాగా, పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న మస్తాన్ కోసం ముమ్మర గాలింపు చేపడుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7386
వెండి కిలో ధర	రూ. 92,500
వెండి ఒక గ్రాము	రూ.95.50

10 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలక్రిష్ణారెడ్డినగర్‌లో బుధవారం బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసుల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కట్ట పద్మను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

'ప్రైవేటు'కు వెళ్లండి!

● జీజీహెచ్‌లో రోగులను బయటకు పంపుతున్న వైద్యులు ● పలు విభాగాల్లో ఖాళీగా పడకలు
● సమయ పాలన పాటించని సిబ్బంది ● పెద్దాసుపత్రిలో పేదల వైద్యానికి గ్రహణం
● సరిదిద్దకుంటే ఎంతో మందికి నష్టం ● ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి సవాళ్ల స్వాగతం

● నెల్లూరులోని ఇస్కాన్‌సిటీ ప్రాంతానికి చెందిన గిరి అనే సెక్యూరిటీ గార్డు గత నెల 30వ తేదీన తన రెండేళ్ల కూతురికి కొద్దిగా ఒళ్లు కాలడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. అక్కడ వైద్యులు వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని గిరిని తొందర పెట్టారు. చేసేది లేక ఆయన చిన్నారిని నారాయణ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటోంది.

● కొన్ని రోజుల క్రితం వెంకయ్య అనే గిరిజనుడు తీవ్ర జ్వరంతో బాధపడుతూ జీజీహెచ్‌కు వచ్చాడు. వైద్యులు అతన్ని పరీక్షించి ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. 'జ్వరమే కదా.. ఇక్కడ చూడరా!' అని ఆ కుటుంబం అడిగినా వారిని భయపెట్టి ఆసుపత్రి నుంచి వెళ్లే దాకా వైద్యులు, సిబ్బంది ఊరుకోలేదు. తీరా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా వైరల్ ఫీవరేనని రెండు రోజులు ఆసుపత్రిలో ఉంచుకుని ఇంటికి పంపించేశారు.

ఇదీ జిల్లా అంతటికీ ప్రధానమైన సర్వజన వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది తీరు. అసలే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య తగ్గుతోంది. అలాంటిది వచ్చిన రోగులను కూడా రకరకాల కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులకు పంపిస్తున్నారు. దీంతో జీజీహెచ్‌లోని పలు విభాగాల్లో పడకలు ఖాళీగా ఉంటున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు మాత్రం రోగులతో కిటకిటలాడుతున్నాయి.



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో వైద్యులు, సిబ్బంది తీరు రోగులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడకు వచ్చే రోగుల్లో 90 శాతం పేద, దిగువ మధ్యతరగతి వారే. 750 పడకలు కలిగిన ఈ ఆసుపత్రిలో 225 మంది వైద్య నిపుణులున్నారు. అయితే కొన్ని విభాగాల్లో సరైన వైద్య చికిత్సలు అందటం లేదన్న విమర్శలున్నాయి. ఈ కారణంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మ వ్యాధుల విభాగం, కంటి విభాగంలో పడకలు ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు జిల్లాలో ప్రబలుతున్నాయి. ఎక్కువగా డెంగ్యూ మలేరియా కేసులు నమోదవుతున్నాయి. వీటితోపాటు వైరల్ ఫీవర్ కేసులు వస్తున్నాయి. వీరిలో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. కొందరు జనరల్ ఆసుపత్రికి వచ్చినా అక్కడ బాధితుల సేవల్లో నిర్లక్ష్యం చూపుతున్నారు.

ఇక్కడ హాజరు - అక్కడ సేవలు

కొందరు వైద్య నిపుణులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హాజరు వేసి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తున్నారు. న్యూరో సర్జరీ విభాగంలో ఇద్దరు వైద్య నిపుణులు ఉన్నారు. వీరికి నెలకు రూ.5 లక్షలకుపైగా వేతనం అందుతోంది. అయితే వీరు ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నట్లు విమర్శలున్నాయి. మరికొందరు వైద్యులు కూడా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంకొందరు వైద్యులైతే జీజీహెచ్‌లో ఓపీ సేవలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఎంపికైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ఎన్నో సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. రోగులకు తక్షణ, మెరుగైన వైద్య సేవలు అందించడమేకాక పారిశుధ్యాన్ని మెరుగుపర చడం, రోగుల భద్రతకు మరింత పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇప్పటికే కొన్ని సమస్యలను గుర్తించాం. వాటిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతాము. రోగులకు సకాలంలో వైద్య చికిత్సలు అందేలా చూస్తాము. జీజీహెచ్‌కు ఉన్న మంచి పేరు నిలిపేలా పనిచేస్తాం.

- మడపర్తి శ్రీనివాసులు,
ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్

30 మంది సచివాలయ సిబ్బందికి మెమోలు

కొండాపురం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలకు సక్రమంగారాని 30 మంది సిబ్బందికి ఎంపీడీవో ఆదినారాయణ బుధవారం మెమోలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 సచివాలయాలను తరచూ తనిఖీ చేస్తున్నామన్నారు. విధులకు సకాలంలో హాజరుకాని 30 మందిని గుర్తించామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వీరందరికీ మెమోలు జారీ చేశామన్నారు. మెమోలు అందుకున్న సిబ్బంది మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలన్నారు.

సంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

ఏఎస్ పేట (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు అమలుచేసే అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని ఏఎస్‌పేట మండల యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈమేరకు ఎంఈవో జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

11న 'డీకేడబ్ల్యూ'లో
ఇంగ్లీష్ వర్క్‌షాప్

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11వతేదీన ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో నాన్ వెర్బల్ కమ్యూనికేషన్ ప్రాముఖ్యత, వ్యవహారశైలిపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ కార్యక్రమానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి
మృతదేహం గుర్తింపు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంటకు చెందిన చల్లా లక్ష్మమ్మ (60) మంగళవారం కనిపించకుండా పోగా ఆమె మృతదేహం బుధవారం లభ్యమైంది. స్థానికుల వివరాల మేరకు, లక్ష్మమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం 11 గంటలకు పశువులు తోలుకుని పోయింది. సాయంత్రం అయినా ఆమె రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి గాలిస్తుండగా లక్ష్మమ్మ మృతదేహం తాళ్లూరు అటవీప్రాంతంలోని వాగులో ముళ్ల చెట్టుకు తగులుకొని ఉన్నట్లు గ్రామస్థులు గురించారు. ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా, బాధిత కుటుంబీకులు కేసు నమోదుకు అంగీకరించలేదన్నారు.

కావలిలో రేషన్ బియ్యం పట్టివేత

● 136 బస్తాల స్వాధీనం



లారీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

కావలి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని కావలి పాతూరులోని వెంగాయగారిపాలెంరోడ్డులో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు వెంగాయగారిపాలెంరోడ్డులోకి తహసీల్దార్ వెళ్లగా, అక్కడ వెంకారెడ్డి రైస్‌మిల్లు సమీపంలో నుంచి హైవే వైపు వెళుతున్న లారీని ఆపి తనిఖీ చేశారు. అందులో 50 కిలోల ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేసి ఉన్న 136 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయి. ఆ లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి బియ్యం ఎంఎల్‌ఎస్‌పాయింట్‌కు అప్పగించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. లారీ డ్రైవర్ బాలయ్యను విచారించగా తాను క్లీనరనని, నెల్లూరుకు చెందిన లారీ యజమాని రాజేంద్రరెడ్డి తనను కావలికి పంపి ఫలానా చోట లారీ ఉంటుంది, అక్కడ డ్రైవర్‌కు అన్నం ఇవ్వమని చెప్పారని తెలిపారు. తాను డ్రైవర్‌కు అన్నం తీసుకెళ్లి ఇవ్వగా, ఆయన లారీని మద్దూరుపాడు బైపాస్‌లో ఉన్న లారీ కాటా వద్దకు తీసుకెళ్లి తూకం వేయించమని చెప్పాడని, తాను లారీని తీసుకెళుతుండగా అధికారులు పట్టుకున్నారని తెలిపారు. ఈ బియ్యం ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్లేది తనకు తెలియదని వివరించాడు. వాస్తవంగా సుమారు 20 టన్నులకుపైగా పట్టే ఆ లారీలో కేవలం 136 బస్తాలే ఉన్నాయంటే మాఫియా ముఠా అన్నీ మిల్లుల్లో ఉన్న రేషన్ బియ్యాన్ని ఒకే లారీలో లోడు చేసుకుని తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తొలుత వెంగాయగారిపాలె రోడ్డులో ఉన్న రైస్‌మిల్లులో ఉన్న బియ్యాన్ని తీసుకుని మద్దూరుపాడు రైస్‌మిల్లులకు వెళుతున్న సమయంలో తహసీల్దార్ దాన్ని పట్టుకున్నట్లు తెలిసింది. కాగా లారీని పట్టుకున్న సమయంలో తహసీల్దార్‌కు రైస్ మాఫియా నుంచి ఒత్తిళ్లు, ఆఫర్లు వచ్చినట్లు సమాచారం.

గోదాముల్లో విజిలెన్స్ తనిఖీలు

● రూ. కోటి సరుకు సీజ్



గోదాముల్లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కేంద్ర కార్యాలయానికి చెందిన ప్రత్యేక బృందం బుధవారం నెల్లూరులోని పలు గోదాములపై దాడులు నిర్వహించింది. నవాబుపేటలోని మురగన్ ట్రేడర్స్, శ్రీసాయిబాబు ఎంటర్‌ప్రైజెస్, గ్రేట్ ఏజెన్సీలలో విజిలెన్స్ జిల్లా ఎస్పీ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీ చేశారు. పాన్‌మసాలా, గుట్కా, చిన్నపిల్లల తినుబండారాలు, బీరు ఫ్యాక్టరీలకు పంపే బియ్యానికి సంబంధించి జీఎస్టీలు చెల్లించకపోవడాన్ని గుర్తించారు. రూ.కోటికిపైగా సరుకును సీజ్ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ మురగన్ ట్రేడర్స్, శ్రీసాయిబాబు ఎంటర్‌ప్రైజెస్, గ్రేట్ ఏజెన్సీలు జీఎస్టీ చెల్లించడం లేదని గుర్తించి రూ.కోటికి పైగా సరుకును సీజ్ చేసినట్లు తెలిపారు.



మహిళలతో కలిసి ఆందోళన చేస్తున్న గండిపాళెం వాసులు

మద్యం దుకాణం కోసం ఆందోళన

ఉదయగిరి రూరర్ డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దంటూ ఆందోళనలు చేసిన ఘటనలు ఎన్నో చూశాం. కానీ ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో అందుకు విరుద్ధంగా తమ గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేయాలని బుధవారం మహిళలతో కలిసి స్థానికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. ఇటీవల అధికార పార్టీకి చెందిన ఓ వర్గం గ్రామంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ ఆందోళన చేసింది. తాజాగా మరో వర్గం గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయాలని కోరుతూ మహిళలతో కలిసి ఆందోళన చేయడం విడ్డూరంగా ఉంది. గతంలో లైసెన్స్ మద్యం దుకాణాన్ని గ్రామస్థులు ముక్కుమ్మడిగా ఆందోళన చేపట్టి మూయించారు. అటువంటి గ్రామంలో అధికార పార్టీలోని వర్గ విభేదాల వల్ల ఒకరు మద్యం దుకాణం కావాలని, మరొకరు మద్యం దుకాణం వద్దని ఆందోళన చేయడం చర్చనీయాంశమైంది.

రేపు వీఎస్‌యూలో
జాబ్‌మేళా

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంస్థల సహకారంతో వీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 79896 13024, 95734 82179 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

124 పాఠశాలల్లో సర్వేక్షణ్ పరీక్ష

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 124 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న 2,940 మంది విద్యార్థులకు బుధవారం పరక్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, అభ్యసనా సామర్థ్యం, ఫలితాలు తదితర అంశాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. నెల్లూరులోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు పరిశీలించారు. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలను సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, అకడమిక్ మానిటరింగ్ అధికారి జీ సుధీర్ బాబు, జిల్లా కామన్ పరీక్షల బోర్డు కార్యదర్శి టీ రామ్ కుమార్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

HDFC Life Insurance కంపెనీలో పనిచేయుటకు అడ్వైజర్లు కావలెను. రిటైర్డు ఉద్యోగులు, వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు ప్రాధాన్యత ఇవ్వబడును. వయసు: 30+, చదువు: డిగ్రీ ఆపైన సం.ప్ర. సెల్: 95028 53505
AJR-193945

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు
పూర్తి చేయాలి : ఈఈ


జగనన్న లేఅవుట్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న ఈఈ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు 2025 మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ దయాకర్ సూచించారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నెల్లూరు, ఆత్మకూరు డివిజన్ల పరిధిలోని 22 మండలాల్లో ప్రస్తుతం 39,045 ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. వారంతా వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి పూర్తి చేస్తే ప్రభుత్వ రాయితీ లభించడంతోపాటు నూరు శాతం బిల్లుల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. గడువులోపు నిర్మాణం చేయని లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. నూతన పక్కాగృహాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జనవరిలో విధివిధానాలు మంజూరుచేసే అవకాశముందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ రామకృష్ణ, వర్కు ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే కాకర్ల ధ్యేయం : మన్నేటి


ఆనకట్ట పనులు పరిశీలిస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రూ. 9 కోట్లతో జరుగుతున్న ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆనకట్ట సుందరీకరణ పనులు పూర్తయితే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ట్యాంక్‌బండ్ ఆధునికీకరణతోపాటు మరో ఐలాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీరు, వ్యర్థాలు ఆనకట్టలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తన సొంత నిధులతో ట్యాంక్‌బండ్ సుందరీకరణకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి


అనుమతి పత్రం ఇస్తున్న ఏవో

వింజమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి మండలాల్లోని నర్సరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ నర్సరీ చట్టం -2010 నిబంధనల ప్రకారం తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వింజమూరు ఉద్యాన అధి కారి షేక్ షహీల్ తెలిపారు. బుధ వారం వింజమూరు గ్రామంలో లైసెన్స్ లేని నర్సరీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి నాలుగు రోజుల లోపల తగిన ధ్రువ పత్రాలతో లైసెన్స్‌కు దరఖాస్తు చేసు కోవాలన్నారు. అలాగే నర్సరీ చట్టంపై అవగాహన కల్పించారు. మొక్కలు విక్రయించేటప్పుడు అన్ని వివరాలతో కూడిన బిల్లులను రైతులకు అందజేయాలన్నారు. నర్సరీ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన అప్లికేషన్ ఫారం వింజమూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంతోపాటు రైతు భరోసా కేంద్రాలలో కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. పై రెండు మండలాల్లోని నర్సరీ నిర్వాహకులు అప్లికేషన్‌తోపాటు అవసరమైన పత్రాలు సమర్పించి ఈనెల 8వ తేదీ లోపల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

అసెంబ్లీ ఆవరణలో రోశయ్య విగ్రహం పెట్టాలి


కొణిజేటి రోశయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

కావలిటౌన్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య సంఘం కావలిశాఖ అధ్యక్షుడు తటవర్తి రమేష్ కోరారు. బాపూజీనగర్‌లోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో రోశయ్య తృతీయ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కావలి లో సైతం రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నేతలు కోరారు. కార్యక్రమంలో ఓరుగంటి రామకృష్ణ, పోతుగంటి శ్రీకాంత్ ప్రసాద్, ఏ శివ, సురేష్, శ్రీనివాసులు, గిరి, రాము, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వంటేరు జన్మదిన వేడుకలు


గురువులను సత్కరించిన వంటేరు దంపతులు

జలదంకి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం మండలంలోని ఆయన అభిమానులు, టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పద్మావతి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. బ్రాహ్మణక్రాకలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అదే గ్రామంలోని హైస్కూల్‌లో పూర్వ గురువులు ఎస్‌వీ రాజు, చేజర్ల రమణారెడ్డిలను వంటేరు ఘనంగా సత్కరించారు. టీటీడీ డైరీ, క్యాలెండర్‌లతోపాటు రూ.10వేల నగదు బహూకరించారు. హైస్కూల్ విద్యార్థులకు విద్యా ఉపకరణాలు అందిచారు. వరదారెడ్డి ఎస్టీకాలనీలోనూ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పీ మధురెడ్డి, పీ భాస్కర్‌రెడ్డి, వీ జయచంద్రారెడ్డి, టీ మధుసూదనరావు, పీ రామక్రిష్ణారెడ్డి, కె.మాధవరెడ్డి, సర్పంచి, ఉపసర్పంచిలు ఐ.సుధాకర్, డీ. మాల్యాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరిక


కౌన్సిలర్లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ

ఆత్మకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం వైసీపీకి చెందిన ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. 1వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మలబంటి రాజశేఖర్, వైసీపీకి అనుబంధంగా ఉన్న 2వ వార్డు కౌన్సిలరు దగ్గుమాటి శివకోటారెడ్డిలకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి, షేక్ గౌస్‌బాషా, మాదాల శ్రీనివాసులనాయుడు, గందళ్ల వేణు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీసుబ్రహ్మణ్య విద్యా సంస్థ వార్షికోత్సవం

వింజమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజీవ్‌నగర్‌లోని శ్రీసుబ్రహ్మణ్య విద్యా సంస్థ మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ సురేంద్రరాజు మాట్లాడుతూ వింజమూరు పట్టణంలో నవోదయ ఎంసెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసి సంవత్సరం అయిన సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, చెంచయ్య, పూర్వ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పొంగి ప్రవహిస్తున్న వాగులు

● నీట మునిగిన వరినాట్లు ● రాకపోకలకు వాహనదారుల అవస్థలు


కందుకూరు: పొంగి ప్రవహిస్తున్న ఎర్ర వాగు


జలదంకి : 9వమైలు వద్ద నీట మునిగిన వరినాట్లు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను అనంతరం కొనసాగుతున్న అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గంలో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. బుధవారం సాయంత్రానికి రాళ్లపాడుకు నీటిమట్టం 18.8 అడుగులకు చేరింది. బుధవారం ఉదయం మన్నేరు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో ఒక్కరోజులోనే అడుగు నీరు పెరగ్గా ప్రస్తుతం 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారానికి 19.5 అడుగులకు రాళ్లపాడు నీటిమట్టం చేరే అవకాశం ఉందని ఎగువన మరో జల్లు వర్షం కురిసినా రాళ్లపాడు ప్రాజెక్టు కూడా నిండుతుందని అంచనా వేస్తున్నారు.

నీటమునిగిన వరినాట్లు

● జలదంకి : మండలంలో మంగళ, బుధవారాల్లో వర్షం ముంచెత్తింది. దీంతో కలుజులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. నీటి ప్రవాహానికి మండలంలోని పలుగ్రామాల్లో వరినాట్లు, నారుమళ్లు నీటమునిగాయి. వారం క్రితం వేసిన వరినాట్లు కావడంతో నీరు బయటకు వెళ్లకపోతే కుళ్లిపోయి పనికిరాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పొంగుతున్న వాగులు

● బిట్రగుంట : బోగోలు మండలంలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి నీరంతా చెరువుకు చేరాయి. దీంతో కడనూతల, కోవూరుపల్లి, బోగోలు చెరువులు కలుజులు పారుతున్నాయి. పొలాల్లోకి వర్షపునీరు చేరుకుంది. వర్షం ఇలానే కొనసాగితే నాట్లు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోతారు.

సురక్షిత ప్రాంతాలకు గిరిజనుల తరలింపు

బోగోలు మండలం రామస్వామిపాలెం గిరిజన కాలనీలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరుకోవడంతో తహసీల్దారు ఆదేశాల మేరకు వీఆర్వో మోహన్‌రావు బుధవారం గిరిజనులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో అశోక్, స్థానికులు బత్తుల మల్లికార్జునరావు, రవిచంద్ర పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి

● హిందూ రక్షా వేదిక ఆధ్వర్యంలో నిరసన


కావలిటౌన్: నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంస్థలు

కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో గత కొద్దినెలలుగా హిందువులపై జరుగుతున్న అకృత్యాలను, అక్కడ మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఆపేందుకు భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని హిందూ రక్షా వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన ఆందోళనల్లో భాగంగా బుధవారం కందుకూరులో నిరసన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. పట్టణంలోని అంకమ్మ దేవాలయం నుంచి పెద్దసంఖ్యలో హిందువులు సబ్ కలెక్టరు కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. పోస్టాఫీసు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ రక్షావేదిక ప్రతినిధులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై అకృత్యాలు పెరిగిపోయాయని, అక్కడ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనకు దిగుతున్న హిందువులను కూడా అరెస్టులు చేసి జైళ్లకు పంపుతున్నారని, ఈ దశలో భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి బంగ్లాదేశ్‌లో పరిస్థితులను కట్టడిచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో హిందూ రక్షావేదిక ప్రతి నిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కావలిటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ సంస్థల ప్రతినిధులు, బీజేపీ నేతలు ట్రంకురోడ్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నిర్వహించడం అమానుషమని, ఆటవిక చర్య అని అన్నారు. కార్యక్రమంలో సీవీసీ సత్యం, ఇంటూరి రమణయ్య, వేదగిరి సూర్యనారాయణాచార్యులు, సుధీర్, మందా కిరణ్ పాల్గొన్నారు.

● వింజమూరు : బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని, హిందువులపై దాడులను ఆపాలని నినాదాలు చేస్తూ వింజమూరు శివాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు హిందూ రక్ష వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సావర్కర్, బీజేపీ అధ్యక్షుడు దేగా మధుయాదవ్. కదిరి రంగారావు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, భానుప్రకాష్, రమేష్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు


హుండీ నగదు లెక్కిస్తున్న గ్రామ పెద్దలు

సంగం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ ఇన్‌చార్జి ఈవో చైతన్య ఆధ్వర్యంలో బుధవారం హుండీ నగదును లెక్కించారు. అక్టోబరు 15వ తేదీ నుంచి డిసెంబరు 4 వరకు రూ.83,173 హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి గోపాలకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాలే నిజమైన నేస్తాలు

కావలిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పుస్తకాలే నిజమైన నేస్తాలని ఎంఈవో-1 గోవిందయ్య పేర్కొన్నారు. బుధవారం వెంగళరావునగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పరకాష్ రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాల పనితీరు పట్ల హెచ్‌ఎం హయ్యుల్ హయ్యామ్‌ను అభినందించారు. కార్యక్రమంలో శిక్షకులు బీ అనిత, వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తరలింపు

కలిగిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బుధవారం ఆ కార్యాలయాన్ని గ్రామ సచివాలయం -2 భవనంలోకి మార్చినట్లు ఎంపీడీవో ప్రత్యూష తెలిపారు. మండల ప్రజలు నూతన కార్యాలయం నిర్మాణం జరిగే వరకు ఈ మార్పును గమనించాలని ఆమె కోరారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

కావలిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలో ఈనెల 7, 8 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి పీ పెంచలయ్య కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజా, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి మహాసభల్లో చర్చిస్తారని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు.

విద్యార్థులకు రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలిలోని స్వతంత్ర సంస్థ పరాఖ్ ఈ పరీక్ష నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ జాఫర్ మొహిద్దీన్ పేర్కొన్నారు. ఈ పరీక్షలను కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయం ఉపాధ్యాయుడు బీవీ రవికృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి


డీఈకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నిలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య బుధవారం జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండగానిపల్లి పంచాయతీ లింగాలచెరువు ఆయకట్టు పరిధిలో అర్హత కలిగిన పలువురు రైతులకు ఓటర్ల జాబితాలో పేర్లు లేవన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా ఓటర్ల జాబితా ప్రకటించారని, అధికారులు ప్రకటించిన ఓటర్ల జాబితాలో చనిపోయిన, అనర్హుల పేర్లు అధికంగా ఉన్నాయన్నారు. సాగులో పొలాలు ఉండే రైతులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు.

అర్హులకు న్యాయం చేయాలి: టీడీపీ

ఆయకట్టు పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికి న్యాయం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళికి విన్నవించారు. జాబితాలో చనిపోయిన, అనర్హుల పేర్లు ఉన్నాయని, వాటిని తొలగించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతులు దేవసాని సుధాకర్‌రెడ్డి, కల్లూరి రమణారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : : దివ్యాంగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూతను వివరించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ మాధవి, ఆర్పీ సభ్యులు, పొదుపు సంఘాల గ్రూపు లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

అల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ దివ్యాంగులను ఆదరించాలని ఎంఈవో-1 రవీంద్రనాథ్ అన్నారు. పట్టణ పరిధిలోని ఎంపీయూపీ అనుబంధ భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్, రోలేటర్‌లు అందించి, భోజన సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 సునీత, హెచ్‌ఎం మల్లికార్జునరావు, భవిత కేంద్ర నిర్వాహకులు జే సునీత, పీ శిల్పా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి చొరవతో గ్రామకంఠం భూములకు విముక్తి

లింగసముద్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం గ్రామంలో సర్వే నంబరు 79లోని గ్రామ కంఠం భూమి గత 7 సంవత్సరాల క్రితం 22-ఏలోని నిషేధిత భూముల జాబితాలో నమోదైంది. దీంతో ఈ సర్వే నంబరులోని ఎ 18.80 సెంటు నివాస స్థలంలో రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా గత పాలకులు పరిష్కారం చూపలేదు. దీంతో గత నెల 26న లింగసముద్రం వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు పలువురు అర్జీలు ఇచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమస్యను నెల్లూరు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో కలెక్టర్ సర్వే నంబరు 79లో రిజిస్ట్రేషన్లు జరుపుకునే విధంగా ఉత్తర్వులు విడుదల చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు వేతనాల నిలిపివేత

వరికుంటపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే నేపథ్యంలో మండలంలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులకు నవంబరు నెల వేతనాలు నిలిపివేయడం జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేల లక్ష్యాలను సాధించకపోవడంతోపాటు ఇతర పనుల్లోనూ వెనుకబడి ఉండడంతో మొత్తం 15 పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ అధికారులు వేతనాలు నిలిపివేశారు. దీంతో ఈనెలలో ఇంతవరకు వేతనాలు అందక, వాటి కోసం ఆశగా ఎదురుచూసిన కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేరీతిలో పంచాయతీ కార్యదర్శులు సైతం తమ పరిధిలోని కొంతమంది సచివాలయ ఉద్యోగుల వేతనాలను కూడా నిలిపివేయడం జరిగింది. ఇటీవల 11 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లకు సైతం షోకాజ్ నోటీసులు అందించిన అధికారులు తాజాగా పంచాయతీ కార్యదర్శుల వేతనాలను నిలిపివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక ఇబ్బందులు

ఉలవపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలోని పరిపాలనా విభాగంలో అధికారులు లేక కుర్చీలన్నీ బోసిపోయినట్లు కనిపిస్తున్నాయి. పైగా ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు సకాలంలో అందడం లేదని పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ వివరణ

బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఉప తహసీల్దార్, సీనియర్ అసిస్టెంటు ద్వారా పనులు వేగవంతంగా చేస్తు వచ్చాను. ప్రస్తుతం డీటీ వీరయ్య కూడా బదిలీపై వెళ్లడంతో పని భారం పెరిగింది. అయినప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు.

రైతులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

● మన్నం మధుబాబు, రాళ్లపాడు ప్రాజెక్టు కెనాల్స్ డీఈఈ



కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో ఈ ఏడాది వరిసాగుకు నీరందిస్తున్నందున రైతులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ప్రాజెక్టు కెనాల్స్ డీఈఈ మన్నం మధుబాబు తెలిపారు.

? దాదాపు ఏడేళ్ల తర్వాత రాళ్లపాడు ఆయకట్టులో పూర్తిస్థాయిలో వరిసాగుకు నీటిని విడుదల చేస్తున్నారు కదా.. ఆయకట్టు అంతటికీ నీరందించగలుగుతారా. లస్కర్ల సమస్య లేదా.

! ప్రాజెక్టుపై ప్రస్తుతం ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారు. ఇతర ప్రాంతాలలో కూడా తగినంతమంది లేనందున ప్రస్తుతం లస్కర్లను తీసుకురావటం కష్టసాధ్యం. అందుకే ఆయకట్టు రైతులతో చర్చించి ప్రైవేటు వ్యక్తులను నీరు కట్టుకు నియమించేలా ఏర్పాట్లుచేస్తున్నాం

? కాలువల పరిస్థితి ఏమిటి ?

! కాలువలకు ఇబ్బంది లేదు. ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కెనాల్స్‌ను కూడా నీటిపారుదలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

? ప్రాజెక్టులో సరిపడినంత నీరు లేదు కదా.. ఆయకట్టు అంతా వరి నాటితే ఇబ్బంది రాదా.

! 21 అడుగుల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో నీటిమట్టం 18.8 అడుగులకు చేరింది. ఈ వర్షం నీటితోనే చాలామంది నాట్లు వేస్తున్నారు. సోమశిల జలాలు కూడా వచ్చే అవకాశం ఉన్నందున ఇబ్బంది రాదనుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

హెల్త్ సబ్ సెంటర్ల తనిఖీ

ఉలవపాడు, డిసెంబరు 4 : కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (డీపీవో)రమేష్, డీపీఏ శ్రీషైనీ ఉలవపాడు, కరేడు హెల్త్ సబ్ సెంటర్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. హైరిస్క్ గర్భిణులకు ప్రభుత్వం తరుపున అందుతున్న సేవలు, వ్యాక్సిన్‌లు వాటి తాలుకా ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి కే శ్రీనివాసులు, పీహెచ్‌ఎన్ సీతారాములు, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, పద్మ టాస్క్‌ఫోర్స్ టీం వెంట ఉన్నారు.

ప్రశాంతంగా రైల్వే ఎన్నికలు

బిట్రగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బిట్ర గుంట రైల్వే సెక్షన్ పరిధిలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా సాగాయి. రైల్వేసెక్షన్‌లో పని చేస్తున్న వివిధ శాఖల కార్మికులు మొత్తం 850 మంది ఉండగా, 314 మంది ఓటు హక్కును వినియోగించుకున్నా రు. విధి నిర్వాహణలో ఉన్న మిగిలిన కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గురువారం కూడా సమయం ఉందని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ ఎన్నికలను రైల్వే ఆర్పీఎఫ్ ఎస్సై మహేంద్రబాబు, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

పశు వైద్యశిబిరం

అనంతసాగరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిలకలమర్రిలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గేదెలకు చూడి పరీక్షలు మరియు నట్టల నివారణ మందులను తాపించారు. పాడి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడీ శ్రీనివాసులు, ఏడీ గురుజయంతి, డాక్టర్లు ప్రసాద్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

ఏఎస్ పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లవ కాలువ ఆక్రమించి పూడ్చి వేయడంతో వర్షపు నీరు పారే అవకాశం లేక తమ వరి నార్లు నీట మునిగాయని చిరమన గ్రామ రైతులు బుధవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. గతంలో దీనిపై ఫిర్యాదు అందిస్తే ఆయన పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా ఆక్రమణలు తొలగలేదని, ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు.

రైతులకు ప్రభుత్వ సహకారం

అల్లూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. మండలంలోని గ్రద్దగుంటలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

వరికుంటపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ చేయించుకున్న వెంటనే సంబంధిత పత్రాలతో మీసేవా కేంద్రాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం నగదును చెల్లించాలన్నారు. అలాగే వరి సాగు చేసిన రైతులు 31వ తేదీలోపు ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. అలాంటి వారికి మాత్రమే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

● బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు



బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

? : సదస్సులతో రైతు సమస్యలు పరిష్కారమౌతాయా.

! : మా పరిధిలో చేయగలిగినవిగా ఉంటే తప్పకుండా పరిష్కారం చేస్తాం. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యేవైతే సిఫార్సు చేస్తాం.

? : గ్రీవెన్స్‌లో ఎలాంటి సమస్యలు వచ్చాయి

! : సాదా బైనామాలు, రీసర్వేలో తలెత్తిన సమస్యలు, బాట సమస్యలు, వారసత్వ భూములకు పాసుపుస్తకాలు.1బీ అడంగళ్ సమస్యలపై అర్జీలు వచ్చాయి.

? : సచివాలయ పరిధిలో పరిష్కారం అవుతాయా.

! : అంతా ఆన్‌లైన్ ద్వారానే... తహసీల్దారు కార్యాలయం నుంచే సమస్యలు పరిష్కారిస్తాం.

? : రీసర్వేలో తలెత్తిన భూమి విస్తీర్ణంలో మార్పులు సరిచేస్తారా.

! : జాయింట్ ఎల్‌పీఎంలో సమస్యలుంటే వాళ్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, అనుభవం మేరకు భూమి సర్వేచేసి వ్యక్తిగత ఎల్‌పీఎం కల్పించి పరిష్కారిస్తాం.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :రెవెన్యూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీటీ విజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డులు, భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

● సద్వినియోగం చేసుకోండి

తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు టీవీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు.స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఈ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. శుక్రవారం నుంచి ఈనెల 31వతేదీ వరకు ప్రతి పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామన్నారు. తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

హుండీ లెక్కింపు

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పూడిపర్తిలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించినట్లు ఈవో ఎన్ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ ఏడాదికిగాను రూ.63,441 వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో రామతీర్థం ఆలయ ఈవో రామకృష్ణ, దేవదాయ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

రాపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోనుపల్లి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పరక్ రాష్ట్రీయ సర్వేక్షన్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షను మండల విద్యాశాఖ అధికారి గుండవేలు శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్య నాగేంద్ర కుమార్, విజయలక్ష్మీ, పెనుబర్తి పాఠశాలల సముదాయం సీఎంఆర్టీ నర్సింహులు, ప్రసన్న, తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

Ms. Shriram Finance Ltd., Nellore-1

SCHEDULE

Perepi Venugopal, B.Com., B.L., Advocate, Tekkemitta, Nellore. Cell: 8374259528



ఏరోసోల్ సైన్స్ పాత్ర కీలకం

వెంకటాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమకాలీన పరిశోధనలో ఏరోసోల్ సైన్స్‌ది కీలక పాత్ర అని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బుధవారం ఏరోసోల్ సైన్స్ టెక్నాలజీలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఆరోగ్య పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాల్లో ఏరోసోల్ సైన్స్ పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం వెంకటరత్నం, డాక్టర్ వీ రవికిరణ్, డాక్టర్ చైతన్య, డాక్టర్ టీఎల్ మాధవన్, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

చిరు వ్యాపారులపై మానవత్వంతో వ్యవహరించాలి

నెల్లూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మార్జిన్ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారి విషయంలో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. బుధవారం హరనాథపురం, ముత్తుకూరు రోడ్డు ప్రాంతాల్లో చిరువ్యాపారుల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు మార్జిన్ వ్యాపారుల వల్ల ఏ ఒక్కరికీ ఇబ్బందులుండవని, వారిని ఎవరూ ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డి 'గడప గడప' ప్రారంభం

నెల్లూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టిన 'గడప గడపకు' కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. నగరంలోని రామలింగా పురంలో భారీగా తరలివచ్చిన టీడీపీ కార్యకర్తల మధ్య ఈ కార్యక్రమం మొదలైంది. గిరిధర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో తన అన్న, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కనీసం నాలుగు సార్లు వెళ్లారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రస్తుత కార్యక్రమానికి శ్రీకారం చుట్టానని చెప్పారు. ప్రజలంతా ఆశీర్వదించి ఈ కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో హరనాథపురం జంక్షన్ జనసంద్రమైంది. దీంతో పోలీసులు వాహన రాకపోకలను దారిమళ్లించారు.



గిరిధర్‌రెడ్డికి హారతిస్తున్న మహిళలు

9 నుంచి హనుమాన్ చాలీసా అఖండ పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఈనెల 9 నుంచి 12వతేదీ వరకు హనుమాన్‌చాలీసా అఖండ పారాయణం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 72గంటలపాటు నిరవధికంగా చాలీసా పారాయణాన్ని అఖిల భారత హనుమదీక్షా పీఠం విజయవాడ వారు నిర్వహిస్తున్నారని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇందుకూరుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ఎస్ శ్రీనివాసులు, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి, హెల్త్ సెక్రటరీ హస్నా తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలను భద్రపరిచే గది కేటాయించండి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4: నగర పంచాయతీలో అద్దె ఇళ్లలో కాపురాలు ఉండేవారు ఎవరైనా చనిపోతే, ఆ ఇంటి యజమానులు మృతదేహాన్ని ఇంటిలో ఉంచుకునేందుకు ఒప్పుకోవడంలేదు. అలాంటి వాళ్లకోసం బుచ్చి హిందూ శ్మశాన వాటిక పక్కన ఓ గది ఏర్పాటుకు స్థలం కేటాయించాలని స్థానికులు రాజకుమార్, రత్నప్రసాద్ తదితరులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కమిషనర్, ఇతర అధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

భాస్కర్‌రావుకు నేతల నివాళి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని కాశీపాళెంకు చెందిన దివంగత బీజేపీ నేత రామిశెట్టి భాస్కర్‌రావు 15వ వర్ధంతిని బుధవారం మలిదేవి కాలువ సెంటర్ కొత్త బస్టాండ్ వద్ద నిర్వహించారు. ఆయన విగ్రహానికి బంధువులు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు భార్య రమణమ్మ, కుమారులు మోహన్‌బాబు, కళ్యాణ్, బీజేపీ నాయకుడు కాసా శ్రీనివాసులు తదిదతరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు రేపు 'స్టడీ ప్లస్'

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతిలో పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం టౌన్‌హాలులో స్టడీప్లస్ పేరుతో శిక్షణ ఇవ్వనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు, సైకాలజిస్ట్ కే డోమినిక్ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా వారిని సన్నద్ధం చేస్తామన్నారు. శిక్షణలో ప్రముఖ సైకాలజిస్ట్‌లు, విద్యావేత్తలు పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 1200 మంది విద్యార్థులు రెండు విడతలుగా శిక్షణకు హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఇస్తారన్నారు. కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఈ శిక్షణ పూర్తి వివరాలకు 9441935461, 8919053022, 9704405138 నెంబర్లను సంప్రదించాలని కోరారు.


గర్భిణులకు పండ్ల పంపిణీ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భారత నావికా దినోత్సవం సందర్భంగా బుధవారం 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని గర్భవతులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎస్సీపీ సెంకడ్ ఆఫీసర్ గణేష్ ఆధ్వర్యంలో కేఎస్ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేడెట్లు ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికారి నరేంద్రబాబు మాట్లాడుతూ 1971 డిసెంబరు 4న భారత్ - పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగినప్పుడు ప్రధాన ఓడరేవు అయిన కరాచీపై భారత నౌకాదళం దాడిచేసి విజయం సాధించింద న్నారు. ఈ నేపథ్యంలో భారత నౌకాదళం ఏటా నావికా దినోత్సవం నిర్వహిస్తోందని చెప్పారు.

ఘంటసాలకు ఘన నివాళి

నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి) : సంగీత ప్రపంచానికి రారాజు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఘంటసాల అభిమాని, గాయకుడు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి గాయకులు ప్రసాద్, రామచంద్రరావు, ఆనంద్‌తో కలిసి పుష్పాంజలి ఘటించారు. సుబేదారుపేటలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి జరిగింది.

తుమ్మల కృష్ణారెడ్డికి కన్నీటి వీడ్కోలు



నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీసు ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ తుమ్మల కృష్ణారెడ్డి అంతిమ యాత్ర బుధవారం నగరంలో జరిగింది. తోటి వారికి సహాయం చేయడమే ఆయన నైజమని, ఆర్థికంగా ఇబ్బందులుపడుతున్న ఎన్నో కుటుంబాలను ఆదుకున్నారని పలువురు గుర్తు చేసుకున్నారు. కృష్ణారెడ్డి పార్థివ దేశం మాగుంటలే అవుట్ నుంచి ఊరేగింపుగా బయలుదేరింది. అల్లీపురం క్రిస్టియన్ శ్మశాన వాటికలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు, రాజకీయ నాయకులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీనివాసరాజు, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు జీ హనోక్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, డాక్టర్ కోడూరు హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నుడా చైర్మన్ కోటంరెడ్డికి సత్కారం



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పప్పులవీధి శివాలయం కమిటీ, ఆరో డివిజన్ టీడీపీ నేతలు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని బుధవారం సత్కరించారు. రెండోసారి నుడా చైర్మన్ పదవి రావటంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండా ప్రవీణ్, రఘురామిరెడ్డి, సురేష్, రవి, రామకృష్ణ, సుధాకర్, హరి, చరణ్‌బాబు, కల్యాణరెడ్డి పాల్గొన్నారు.

పంటపాలెం చెరువుకు గండి.. యుద్ధప్రాతిపదికన పూడ్చివేత

ముత్తుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వస్తున్న వరద నీరు పంటపాలెం చెరువుకు భారీగా చేరడంతో బుధవారం సాయంత్రం నారికేళపల్లిలోని సమీపంలో చెరువుకు గండి పడింది. పరిస్థితిని గమనించిన దొరువులపాలెం టీడీపీ నాయకులు మునుకూరు మురళీధర్‌రెడ్డి, మిట్టపాలెం తెలుగు యువత నాయకులు వెంటనే ఇరిగేషన్ ఏఈ వేమారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన చెరువుకు గండిపడిన చోటుకు వచ్చి పరిశీలించారు. తమ సొంత ఖర్చులతో గండి పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. రైతులకు నష్టం వాటిల్లకుండా యుద్ధప్రాతిపదికన చెరువు గండి పూడ్చేందుకు చర్యలు తీసుకున్నామని టీడీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి తెలిపారు.



ముత్తుకూరు : చెరువు గండిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు మురళీ, ఏఈ వేమారెడ్డి



మనుబోలు : కలుజు పారుతున్న మనుబోలు చెరువు

● కలుజు పారుతున్న మనుబోలు చెరువు

మనుబోలు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జలపాతంలా ప్రవహిస్తున్నది మనుబోలు పెద్దచెరువు. ఇటీవల కురిసిన వర్షాలకుతోడు ఎగువ నుంచి చెరువుకు భారీగా వరదనీరు రావడంతో గతంలో ఎన్నడూలేనంతగా కలుజుపైకి పొంగి పారుతోంది. ఈదఫా పంటలకు సాగునీటికి ఇబ్బంది లేదని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలోని కొలనుకుదురు చెరువు తూము దెబ్బతింది. తాత్కాలికంగా తూము వద్ద 500మట్టి బస్తాలు వేసి బుధవారం నీటికి అడ్డుకట్టవేశారు.

అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఎమ్మెల్యేకి వినతి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): 'అమ్మా... ప్రశాంతమ్మ గారూ... నగర పంచాయతీలో నయా దందా సాగుతోంది. రూ. 50కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం అయ్యాయి. గత ప్రభుత్వంలోనూ ఇప్పుడూ అదే పరిస్థితిగా ఉంది.. ఇప్పటికైనా విజిలెన్స్ విచారణ జరిపించి నిగ్గు తేల్చాలి' అంటూ పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కోరారు. బుధవారం బుచ్చి నగర పంచాయతీలో చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కమిషనర్ చంద్రశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కౌన్సిలర్ల వై శివకుమార్‌రెడ్డి, ఎస్‌కే. షాహుల్, ప్రత్యూష విమర్శించారు. దీంతో సమావేశం రసాభాస అయింది. అజెండాలోని ప్రతిపాదనల్లో పనుల చేపట్టాల్సిన ప్రాంతాలు, అంచనాలు, వివరాలు ఏమీ లేకండానే కౌన్సిల్ ముందుంచారంటూ కమిషనర్‌పై మండిపడ్డారు. కౌన్సిలర్ల విమర్శలపై ఎమ్మెల్యే స్పందిస్తూ అవకతవకలకు తావులేకుండా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

● ప్రజల అవసరాలు తీర్చలేరా ?

పభుత్వం వచ్చి ఆరునెలలు అయినా నగర పంచాయతీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రజల కనీస అవసరాలయిన తాగునీరు, డ్రైన్లలో పూడికతీత, విద్యుత్ సమస్యలు కూడా తీర్చలేకుండా ఏమి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కమిషనర్‌ని ప్రశ్నించారు.

● సచివాలయం ప్రారంభం

ముందుగా గోపాల్‌రెడ్డినగర్‌లోని సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నగర పంచాయతీ కార్మికులకు యూనిఫారం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరామకృష్ణారెడ్డి, హరికృష్ణ, ఎంవీ. శేషయ్య, గోవర్ధన్‌రెడ్డి, హరనాథ్, గుత్తా శ్రీనివాసులు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గిరిజన పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేయాలి

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమ్మె చేస్తుండటంతో 20 రోజుల నుంచి పదో తరగతి విద్యార్థులకు తరగతులు జరగడం లేదన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. అనంతరం డీపీవోకు వినతిపత్రం అందచేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం చేస్తానని ఆయన హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనీష్, శివమ్, వర్మ, అబ్దుల్ కలీం, సుధీర్, శరణ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

దోమ తెరలు, దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(విద్య), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శాంతినగర్ బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఉండే 160 మంది బాలికలకు సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ యాచమనేని బృంద మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో ఉండే పేద విద్యార్థిలకు తమ వంతు చేయూతనందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఇందులో సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, సహాయ సాంఘీక సంక్షేమాధికారి హజరత్తయ్య, వార్డెన్ సౌజన్య, పెనుబల్లి సీతారామయ్య, కృష్ణచైతన్య, సూరిశెట్టి ఉమా సురేంద్ర, ట్రస్ట్ సభ్యులు పాకాల శ్రీవల్లి, శ్రీకాంత్, ఉమారాణి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నగర పాలక పాఠశాలలో అవగాహన

నగరంలోని సుంకు చెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ శ్రీహరి మాట్లాడుతూ గుడ్ అండ్ బ్యాడ్ టచ్ గురించి తెలియచేయడమే కాక ఏదైనా సమస్య వస్తే వెంటనే 100 లేదా 112 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సతీష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కే అరవింద్, ఉపాధ్యాయులు మస్తాన్‌నాయుడు, స్వర్ణ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కేసు ఉపసంహరించుకున్నందుకు ఫ్యాప్టో నేతల ధన్యవాదాలు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఫ్యాప్టో నాయకులపై గత ప్రభుత్వంలో దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో ఆ ఉపాధ్యాయ సంఘ నాయకులు బుధవారం దర్గామిట్ట స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యను కలిసి సత్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలోనే మొట్ట మొదటిగా నెల్లూరు జిల్లా ఫ్యాప్టో నాయకులపై కేసును ఉపసంహరించుకోవ డం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో నమోదు చేసిన అక్రమ కేసులు వల్ల ప్రమోషన్లు రాక, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో మంజూరు కాక, పాస్‌పోర్టులు జారీకాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు తాళ్యూరు శ్రీనివాసులు నాయుడు, సురేంద్ర రెడ్డి, చిట్టేటి రమేష్, మురళీధర్, హజరత్, నవకోటేశ్వరరావు, పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటి? : పార్లమెంటులో వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 : మత్స్యకారుల సంక్షేమానికి కేంద్రం ఏమి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని పార్లమెంటులో బుధవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధానమిస్తూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

చికెన్ వ్యర్థాలను చేపల మేతగా వాడితే అడ్డుకోండి : ఎమ్మెల్యే

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 4 : చికెన్ వ్యర్థాలను చేపల మేతగా వాడితే అడ్డుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆ నియోజ కవర్గ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆమె నివాసంలో బుధవారం కోవూరు నియోజకవర్గ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కుళ్లిన చికెన్ వ్యర్థాలు, పశు కళేబరాలు మేతగా వాడుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న చేపల రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చికెన్ వేస్ట్‌ను చేపల మేతగా వాడకాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు.

గర్భవతికి అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భవతికి నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన వైద్య చికిత్సలు జరిగాయి. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మారం జనిత్య మాట్లాడారు. బుచ్చి మండలం దామరమడుగుకు చెందిన గర్భవతి (20) తీవ్ర మైన డెంగ్యూ వ్యాధికి గురైందని, ప్లేట్ లెట్ల సంఖ్య 15వేలకు పడిపోయిందని తెలిపారు. గతనెల 29వ తేదీన కిమ్స్ ఆసుపత్రికి రావడంతో పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించి ప్రత్యేక చికిత్సల ద్వారా తల్లీబిడ్డను కాపాడామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి : షేగు షణ్ముఖరావు

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ తొలి అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి షేగు షణ్ముఖరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా రైస్‌క్యాన్వాసింగ్ అసోసియేషన్ హాలులో రోశయ్య తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు రోశయ్య చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. షణ్ముఖరావు మాట్లాడుతూ రోశయ్య రెండు తెలుగు రాష్ట్ర ప్రజలకు ఆత్మీయుడని తెలిపారు. ఆర్థిక మంత్రిగా 16సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సాధించిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ, ఆంధ్ర సచివాలయాల్లోనూ ఆయన విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. రోశయ్యకు భారతరత్న బిరుదు ఇచ్చి గౌరవించాలని ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్టోన్‌హౌస్‌పేటలో రోశయ్య విగ్రహం ఏర్పాటుకు నగర పాలక సంస్థ అనుమతి ఇస్తే ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ఈసీ మెంబర్లు పీవీ శేషారావు, ఎంపీ ఆంజనేయులు, కోట మధుసూధన్‌రావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

'ఉపాధి' పనులతో గ్రామాభివృద్ధి

విడవలూరు,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులతో గ్రామీణాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో నగేష్‌కుమారి తెలిపారు. 2024-25 సంవత్సరానికి ఉపాధి పనులను గుర్తించటానికి పార్లపల్లి, విడవలూరు సచివాలయాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. విడవలూరులో జరిగిన సభలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి మండలంలో 156 పనులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో టీపీలు ప్రేమ్‌కుమార్, ఇలియాజ్, టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, సీపీఎం నేత తుళ్లూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడాలి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, తగిన మోతాదులో ఎరువులు వాడాలని ఆత్మ పీడీ శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని కోడూరు-1, 2 గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ సంచాలకులు ఎ.రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి వీవీ.శిరీష, రాణి, వీఏఏ శశి, దయానా తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పొదలకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ బలోపేతానికి కృషి చేసి, ఆకస్మికంగా మరణించిన గంథం రమేష్ మొదటి వర్ధంతి సందర్భంగా బీమ్ సోమిరెడ్డి ఆర్మీ ఆ కుటుంబానికి బుధవారం రూ.2లక్షల చెక్కును అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, నాయకులు ఎస్‌కె.జమీర్‌బాషా, ప్రభాకర్‌రెడ్డి, కూరపాటి విజయబాబుల చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏకుల సురేష్‌బాబు, దువ్వూరు పాండు, షేక్.దిలీప్, కూరపాటి కాంతులు, అంకయ్య, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెం సచివాలయలంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.సురేంద్రరెడ్డి, పంచాయతీ సెక్రటరీ, వెటర్నరీ అధికారి, ఏఈవో ఎస్. ఇందు, గ్రామ వ్యవసాయ సహాయకులు కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గా భవానీ దీక్షల ప్రారంభం

నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కాశీనాయన ఆశ్రమంలో బుధవారం దుర్గా భవానీ దీక్షలు ప్రారంభమయ్యాయి. ధర్మ సింధు ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమితి సభ్యుడు ధన్వి శ్రీనివాస్, భవానీ చెంగళరాయుడు, ధర్మ సింధు టీమ్ సభ్యులు ఉల్లి అనిల్‌కుమార్, కంచెర్ల మహేష్, మహంకాళి వెంకటేష్, చెన్నకృష్ణ, కల్పన, పద్మావతి, సీతమ్మ, శ్రావణి పాల్గొన్నారు.


కృష్ణమందిరం జీర్ణోద్ధరణ ప్రారంభం

నగరంలోని మహాత్మా గాంధీనగర్‌లో ఉన్న కృష్ణమందిరం, వేంకటేశ్వర ఆలయ జీర్ణోద్ధరణ, పునర్నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. మూల విగ్రహాలకు పూజలు చేసి బాలాలయానికి తరలించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

డ్రగ్గిస్టులకు అడ్డా

టూరిజం బిల్డింగ్





అసంపూర్తిగా ఉన్న పర్యాటక భవనం



గంజాయి బ్యాచ్‌లకు అనువుగా ఉన్న భవనంలోని గదులు



భవనంలోని గదుల్లో విచ్చలవిడిగా పడివున్న వాడేసిన సిరంజిలు

తిరుపతిలోని ఎస్వీఆర్ రుయా ఆస్పత్రికి ఎదురుగా అసంపూర్తి నిర్మాణంగా మిగిలిపోయిన టూరిజం భవనం డ్రగ్గిస్టులు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారుతోంది. గత పదేళ్లుగా ఇది మొండిగోడలకే పరిమితం అయ్యింది. నిర్మాణం పూర్తయి గదులు, గదులుగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అనువైన వేదికగా మారింది. గంజాయి, డ్రగ్స్‌కి అలవాటు పడినవారు అక్కడకి చేరిపోతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం వీరికి వరంగా మారింది. రెండు రోజుల కిందట అటువైపునుంచి మత్తులో తూలుతూ బైక్‌పై వచ్చిన ముగ్గురు తమ వాహనంతో మరో బైక్‌ను ఢీకొట్టారు. ఈఘటనలో రిటైర్డ్ అధికారి డాక్టర్ ఎన్.ధర్మయ్యకు తొడ ఎముక విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనవెంట ఉన్న సాహితీవేత్త సాకం నాగరాజు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బాధితుల ఫిర్యాదుమేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మెడికల్ కాలేజీకి సమీపంలో ఉన్న ఈ భవనం ప్రమాద సంకేతంగా కనిపిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేపు పంచమి తీర్థం

తిరుచానూరులో చక్రస్నానానికి సర్వంసిద్ధం

నేటి రాత్రి నుంచి గ్రామంలోకి వాహనాలకు నో ఎంట్రీ



లక్ష మందికి అన్నప్రసాదాలు

లక్షమందికిపైగా అన్నప్రసాదాలు అందించేందకుఉ 120 ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వెజిటబుల్ ఉప్మా, పొంగల్‌తోపాటూ బాదంపాలు అందజేస్తారు. మధ్యాహ్నం పులిహోర, దద్దోజనం, చక్కెర పొంగలి, కదంబం ఇవ్వనున్నారు. లక్షన్నర నీళ్ల బాటిళ్లను సిద్ధం చేశారు. గురువారం రాత్రికే పెద్ద ఎత్తున చేరుకునే తమిళనాడు భక్తులను హోల్డింగ్ పాయింట్లకు తరలించి అన్నప్రసాదాలు అందజేస్తారు.

తిరుచానూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు... ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. చక్రస్నానం కోసం కొత్త నీటితో పుష్కరిణి సిద్ధమైంది. శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు అభిజిత్ లగ్నంలో పద్మ సరోవరం (పుష్కరిణి)లో చక్రస్నానం నిర్వహిస్తారు. పురాణాల ప్రకారం.. తనపతి అయిన శ్రీహరి తపస్సుకు మెచ్చి పద్మావతి అమ్మవారు పద్మసరోవరంలో బంగారు పద్మంపై కార్తీకమాసం శుక్లపక్షం పంచమి తిథి ఉత్తరాషాఢ నక్షత్రం మంత్ర ముహూర్తంలో ఆవిర్భవించింది. అలాంటి పవిత్ర ఘడియలున్న పంచమితీర్థం రోజున పుష్కరిణిలో స్నానమాచరిస్తే అమ్మవారు సకల సౌభాగ్యాలను ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. అందుకే ఏటా పంచమితీర్థానికి వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. ఒకసారి 30వేల మంది పుష్కరిణిలో స్నానాలు ఆచరించవచ్చని విజిలెన్స్ అధికారులు తెలిపారు. పుష్కరిణిలో తోపులాటలు జరగకుండా టీటీడీ విజిలెన్స్ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

హోల్డింగ్ పాయింట్ల నుంచే పుష్కరిణిలోకి

తిరుచానూరులో మూడు చోట్ల జర్మన్‌షెడ్లతో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్ల నుంచే భక్తులు ఎవరైనా అమ్మవారి పుష్కరిణిలోకి వెళ్లాలి. పుత్తూరు వైపు నుంచి వచ్చే భక్తులకు గోశాల, జడ్పీ హైస్కూల్.. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట వైపు నుంచి వచ్చే భక్తులకు నవజీవన్ ఆస్పత్రి వద్ద హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఈ మూడు చోట్ల నుంచి విడతలవారీగా ప్రత్యేక క్యూలైన్ ద్వారా పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గేట్ నెంబరు 4 నుంచి పుష్కరిణిలోకి అనుమతిస్తారు. పుష్కరిణిలో స్నానాలు పూర్తి చేసుకున్న భక్తులను గేటు నెంబరు 5 గుండా ఘంటసాల విగ్రహంవైపు, గేటు 6 నుంచి సమాజంవీధి గుండా తోలప్ప గార్డెన్‌వైపు మళ్లిస్తారు. గేట్ నెంబరు 3 నుంచి భక్తులు వెలుపలకు వెళ్లడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. పుష్కరిణిలోకి వెళ్లి.. రావడానికి 28 గేట్లు ఉన్నాయి. అందులో పసుపు మండపం వద్దనున్న మూడింటిని వీఐపీలు, అమ్మవారి ఉత్సవమూర్తి రావడానికి వినియోగిస్తారు. టీటీడీ ఉద్యోగులను గేటు నెంబరు మూడు నుంచి అనుమతిస్తారు.

పార్కింగ్ ప్రదేశాలివే

గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు తిరుచానూరులోకి ఎటువంటి వాహనాలను అనుమతించరు. భక్తుల వాహనాలు మినహా మిగిలిన వాటిని దారి మళ్లించనున్నారు. తిరుపతి నుంచి వచ్చే భక్తుల వాహనాలకు మార్కెట్ యార్డు, శిల్పారామం.. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాటికి తనపల్లె వెళ్లే 150 బైపాస్ రోడ్డు, రామానాయుడు కల్యాణ మండపం.. రేణిగుంట వైపు నుంచి వచ్చే వాటికి తిరుచానూరు దళితవాడ వద్ద.. పుత్తూరు నుంచి వచ్చే వాహనాలకు ముండ్లపూడి క్రాస్ సమీపంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి భక్తులు హోర్డింగ్ పాయింట్లకు నడిచి వెళ్లాలి.



భక్తులకోసం సిద్ధమైన హోల్డింగ్ పాయింట్



260 మొబైల్ మరుగుదొడ్లు

తాత్కాలికంగా 260కిపైగా మొబైల్ టాయిలెట్లను టీటీడీ ఏర్పాటు చేసింది. అంబులెన్స్, వైద్యులు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణకు వందలాది మందిని కేటాయించారు.

1600 మందితో బందోబస్తు: ఎస్పీ



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచమి తీర్థానికి 1600 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. తిరుచానూరులో బుధవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. భక్తులందరూ పుష్కరిణిలో స్నానాలు ఆచరించేలా విడతల వారీగా పుష్కరిణిలోకి అనుమతించాలని సూచించారు. చిన్న దొంగతనాలు, తొక్కిసలాట, తోపులాటలకు తావులేకుండా పనిచేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తిరుచానూరు చుట్టుపక్కల రోడ్లు ఎంత క్లియర్‌గా వుంటే వాహనాల రాకపోకలకు అంత సులువుగా ఉంటుందన్నారు. భక్తులను తనిఖీ చేశాక హోల్డింగ్ పాయింట్లలోకి అనుమతించాలన్నారు. పుష్కరిణిలో స్నానమాచరించే సమయంలో ఎవరైనా అకతాయిలు వెకిలి చేష్టలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, రామకృష్ణ చిత్తూరు రిజర్వు అదనపు ఎస్పీ నందకిషోర్‌కుమార్, వీజీవో రాంకుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. పోలీసులతో పాటు 400 మంది టీటీడీ భద్రతా సిబ్బంది, 200 మందిస్కౌట్లు, 200 మంది శ్రీవారి సేవకులను టీటీడీ ఏర్పాటు చేసింది. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.



జాబిల్లిపై సిరుల తల్లి

శోభాయమానంగా చంద్రప్రభ వాహనసేవ

పదునారు కళలతో ప్రకాశించే చంద్రప్రభనే వాహనంగా చేసుకుని ఊరేగుతున్న పద్మావతమ్మ వైభవాన్ని బుధవారం రాత్రి భక్తజనం తన్మయంగా వీక్షించారు. మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటం, భజన బృందాల ఆటపాటలూ, కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవిందనామస్మరణల నడుమ తిరుచానూరు మాడవీధుల్లో చంద్రప్రభ వాహనసేవ వేడుకగా సాగింది.

రథోత్సవానికి సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన గురువారం ఉదయం 8 గంటలకు రథోత్సవం జరగనున్నది. రథం సులువుగా తిరిగేందుకు వీలుగా తిరుమాడవీధుల్లో ఇసుక పరిచారు. మాడవీధుల్లో భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రత కోసం పోలీసులను అధిక సంఖ్యలో నియమించారు.





- మరిన్ని బ్రహ్మోత్సవ విశేషాలు 6లో -

చిచ్చు రేపిన సినీ- పొలిటికల్ ఫ్లెక్సీ

- పుష్ప-2 ఫ్లెక్సీలో వైసీపీ నేతల ఫొటోలు, రాజకీయ కామెంట్లు
- చింపేసిన టీడీపీ వర్గీయులపై రాళ్ల దాడి
- గంటన్నర పాటు ఉద్రిక్తత



పాకాలలో మోహరించిన వైసీపీ, టీడీపీ వర్గీయులు - (ఇన్‌సెట్‌లో)వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

పాకాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాకాలలో సినీ-పొలిటికల్ ఫ్లెక్సీ వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ చిచ్చు రేపింది. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సినిమా థియేటర్‌లో బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా అల్లు అర్జున్ అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు పెట్టారు. వైసీపీ నేత మునీర్ కుమారుడు అఫ్రీద్ కూడా అల్లు అర్జున్‌తో పాటు మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టారు. 'మంచి చేసి మోసపోయిన ఎమ్మెల్యే తాలూకా... 2029 సీఎం తాలూకా... తగ్గేదే లే...' అంటూ కామెంట్స్ కూడా జోడించారు. సినీ ఫ్లెక్సీల్లో నేతల ఫొటోలు, వ్యాఖ్యలపై టీడీపీ మద్దతుదారులు అభ్యంతరం తెలిపారు. తొలగించాలని పట్టుబట్టడంతో ఇరువర్గాల నడుమ వివాదం తలెత్తింది. ఫ్లెక్సీ తొలగింపునకు అంగీకరించకపోవడంతో టీడీపీ వర్గీయులు చించేశారు. దీంతో వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. అదే సమయంలో వైసీపీకి చెందిన వారు కర్రలతో భారీగా చేరుకున్నారు. టీడీపీ వర్గీయులూ రావడంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి, తోపులాటకూ దిగాయి. ఈ క్రమంలో ఓ టీ స్టాల్ పాక్షికంగా ధ్వంసమైంది. ఈ గొడవతో తిరుపతి- దామలచెరువు మెయిన్ రోడ్డులో గంటన్నర పాటు ట్రాఫిక్ స్తంభించింది. డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి పోలీసు బలగాలతో చేరుకుని ఇరువర్గాలనూ చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాజకీయ నేతల ఫొటోలు, కామెంట్లతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వైసీపీ వారే రెచ్చగొట్టారని టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రాంతంలోనూ ఆ పార్టీ మద్దతుదారులు కొందరు రౌడీయిజం చెలాయిస్తుంటారని, దుకాణాల్లో తిష్ట వేసి మహిళల పట్ల వెకిలి చేష్టలకు పాల్పడుతుంటారన్నారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ ఘర్షణకు సంబంధించి వైసీపీ వర్గీయుల తమపై రాళ్లు, కర్రలు, వేడిసీటితో దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. శాంతి భద్రతల సమస్య కారణంగా ఘటనా స్థలి సమీపంలో.. రోడ్డు పక్కన ఉన్న వైసీపీ మద్దతుదారుడి టీ దుకాణాన్ని రాత్రి డీఎస్పీ ప్రసాద్, తహసీల్దారు నిత్యానందబాబు, ఎంపీడీవో శశిరేఖ, పంచాయతీ సిబ్బందితో తొలగించారు.

7న ప్రభుత్వ బడుల్లో 'చదువుల పండుగ'

మెగా పేరంట్స్ మీటింగ్‌కు రూ.42.79 లక్షలు విడుదల

తిరుపతి(విద్య), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏడో తేదీన 'చదువుల పండుగ' నిర్వహించనున్నారు. ఈ మెగా పేరంట్స్ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.42.79 లక్షలు విడుదల చేసింది. మొత్తం 2,322 ప్రభుత్వ పాఠశాలల్లో 1.56 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యనుబట్టి ఆయా పాఠశాలలకు నిధులు కేటాయిస్తారు. 10 మంది లోపుంటే రూ. 1000, 101 నుంచి 200 మంది విద్యార్థులున్న పాఠశాలలకు రూ. 3 వేలు, 301 నుంచి 400 మంది ఉన్న పాఠశాలలకు రూ. 6వేలు ఇలా అత్యధికంగా 901 నుంచి 1000 మంది ఉన్న పాఠశాలలకు రూ. 11 వేల చొప్పున కేటాయించారు. ఈ మీటింగు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి విద్యాపరమైన అంశాలు చర్చించనున్నారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారు? ఏ పాఠ్యాంశంలో వెనుకబడి ఉన్నారు? ఎన్నెన్ని మార్కులు వస్తున్నాయనేది అక్కడికక్కడే తల్లిదండ్రులు తెలుసుకునే వీలు కలుగుతుంది. ఇలా జిల్లాలోని 1.56 లక్షల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించనున్నారు. దీనివల్ల విద్యార్థుల చదువు, ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టిపెట్టి సరిదిద్దేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. పిల్లల చదువులపై వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జవాబుదారీతనం పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని డీఈవో కేవీఎన్ కుమార్ చెప్పారు. విద్యార్థుల ప్రయోజనాలకోసం తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయులు.. ఉపాధ్యాయుల నుంచి తల్లిదండ్రులు ఎలాంటి సహకారం కోరుకుంటున్నారనేది తెలుసుకోవచ్చని ఈ కార్యక్రమ నోడల్ అధికారి జి.సురేష్ తెలిపారు.

సూర్య, చంద్రులే వాహనాలుగా..







సకల జీవుల ప్రాణప్రదాతలు సూర్య, చంద్రులు. ఒకరు భగభగ మండి భయపెట్టినా, మరొకరు చల్లని వెన్నెలతో సేదదీరుస్తారు. ఈ ఇద్దరూ తిరుచానూరు పద్మావతమ్మకి వాహనాలుగా మారారు.
కార్తీక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిధారియైన శ్రీకృష్ణుని అలంకారంలో అమ్మవారు మాడవీధుల్లో ఊరేగారు. రాత్రి చంద్రప్రభపై భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 12 కళాబృందాలు 257 మంది కళాకారులు వాహనసేవల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

నేటితో ముగియనున్న వాహనసేవలు

నవంబరు 28న చిన్నశేషవాహనంతో మొదలైన వాహనసేవలు గురువారం రాత్రి అశ్వ వాహనసేవతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.



బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: రథోత్సవం
సాయంత్రం 6 గంటలకు: ఊంజల్ సేవ
రాత్రి 7 గంటలకు: అశ్వవాహనం









గల్లంతైన షారూక్ మృతదేహం లభ్యం



చిట్టమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మల్లాం రొయ్యల కాలువ సమీపంలోని చప్టా వద్ద వరద ప్రవాహంలో గల్లంతైన షారూక్(23) మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. మంగళవారం ఉదయం ఇద్దరు గల్లంతు కాగా.. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభించింది. బుధవారం తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్‌ఐ చిన్న బలరామయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని షారూక్ మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు లోతైన ఈ గుంతలో వలలు వేసి గాలించగా షారూక్ మృతదేహం బయటపడింది. షారూక్ పనిచేసే చికెన్ షాపు యజమాని షేక్ జలీల్ అహ్మద్ చొరవతో అతడి మృతదేహాన్ని జార్ఖండ్ రాష్ట్రం రాహ గ్రామానికి అంబులెన్స్‌లో పంపారు.

పిడుగుపడి వలస కూలీ మృతి

డక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలో బుధవారం పిడుగు పడి వలస కూలీ మృతి చెందారు.గుంటూరు జిల్లా నిజాంపట్నం మండలం అడవుల దీవి గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ (30) వారం కిందట భర్త వెంకటేశ్వరరావుతో కలిసి వరినాట్లు వేసేందుకు గ్రామానికి వచ్చారు. బుధవారం పొలాల్లో వరినాట్లు వేస్తుండగా ఆమెపై పిడుగు పడడంతో కుప్పకూలారు. వెంటనే వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమెకు భర్త, ఐదేళ్ల బాబు, ఆరేళ్ల పాప ఉన్నారు.



వెంకటేశ్వరమ్మ (ఫైల్‌ఫొటో)

పూర్వ చిత్తూరు డీఎంహెచ్‌వోపై విజిలెన్సు విచారణ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూర్వ చిత్తూరు, ప్రస్తుత తిరుపతి డీఎంహెచ్‌వో శ్రీహరిపై విజిలెన్సు విచారణ కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోగా చేపట్టిన నియామకాలు, ఇతర అక్రమాలకు పాల్పడ్డారంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఇప్పటికే పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నాయి. 2020 నుంచి 2023 వరకు దాదాపు నాలుగు సార్లు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డాక్టర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు భర్తీ చేసిన విషయం విదితమే. ఇందులో అనర్హులకు పెద్దపీట వేసినట్లు విజిలెన్సు విచారణలో తేలినట్లు సమాచారం. ఇటీవల గుంటూరు డీఎంహెచ్‌వో విచారణ అధికారిగా వచ్చి పలు రికార్డులు సీజ్ చేసుకుని వెళ్ళారు. ఇక, నిధుల దుర్వినియోగంపైనా విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వాటిని ఎందుకు డ్రాచేశారు? దేనికి ఖర్చు పెట్టారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

సహాయక చర్యలు చేపట్టాం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం మంగళగిరి సచివాలయం నుంచి హోం మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో తుఫాన్ వల్ల కొన్ని చోట్ల రోడ్లు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయని వాటిని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. ఓవర్‌ఫ్లో ఉన్న కాజ్‌వేలపై రోడ్లకు రోపులతో బందోబస్తు చేశామన్నారు. అటు వైపు ప్రజలు వెళ్లకుండా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, పోలీసులను ఏర్పాటు చేశామన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్ వద్ద 'కిస్సిక్'

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ ముందు ఓ యువతి 'పుష్ప2' చిత్రంలోని 'కిస్సిక్' పాటకు డ్యాన్స్ చేసి తన ఇన్‌స్టా పేజ్‌లో పోస్ట్ చేసింది. ఈ చర్య తీవ్ర విమర్శలకు దారి తీసింది. స్వామి నామాల ముందు ఇదేం పని అంటూ భక్తులు ఆగ్రహించారు. దీంతో ఆమె క్షమాపణ చెబుతూ సాయంత్రానికి మరో వీడియోను పోస్ట్ చేసింది.

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

● వాహనంతో పాటు కత్తి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన ప్రియురాలే కిడ్నాప్ చేయించిన ఘటనలో ఆరుగురు నిందితులను తిరుపతి ఈస్ట్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. తిరుపతి నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కలవకుంట పంచాయతీ రేణుకానగర్‌కు చెందిన వడ్డే శ్రీనివాసులు అలియాస్ నాని కొన్నేళ్ల కిందట తిరుపతికి వచ్చారు. పెద్దకాపులేవుట్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని హోం స్టే నడుపుతున్నారు. మూడేళ్ల కిందట భర్త చనిపోవడంతో మదనపల్లెకు చెందిన సోనియాభాను ఉపాధి నిమిత్తం తిరుపతికి వచ్చారు. ఎనిమిది నెలల కిందట శ్రీనివాసులుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడికి వివాహం కానందున ఇద్దరూ కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె ఇద్దరి పిల్లలనూ తమ వద్దే ఉంచుకున్నారు. నెల కిందట వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పిల్లలను తీసుకుని మదనపల్లెకు వెళ్లిపోయింది. తరచూ శ్రీనివాసులు ఆమెకు ఫోన్ చేసి తిరుపతికి రావాలని కోరారు. శ్రీనివాసులతో తన బిడ్డలకు ప్రాణహాని ఉంటుందేమోని భావించిన సోనియాభాను.. తమ బంధువైన మదనపల్లెలో పాత కేసుల్లో నిందితుడైన బాబా పక్రుద్దీన్‌ను సంప్రదించింది. కిడ్నాప్ చేసి కాలు, చేయి తీసేయాలని భావించిన పక్రుద్దీన్.. తన స్నేహితులు రియాజ్, మోక్షిత్ రాయల్, సందీప్‌కుమార్, రాజేష్‌తో కలసి గత నెల 28న వాహనంలో హోంస్టే వద్దకు వచ్చారు. శ్రీనివాసులుపై దాడిచేసి, కత్తితో బెదిరించి లాక్కెళ్లారు. ఈ కిడ్నాప్ ఘటనపై మీడియాలో ట్రోలింగ్ రావడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, సిబ్బంది వాయల్పాడు పోలీసులను అప్రమత్తం చేశారు. వారు వాహనాల తనిఖీ చేపట్టారు. కిడ్నాపర్లు ఆదమరచి ఉండగా బాధితుడు శ్రీనివాసులు తప్పించుకుని తిరుపతికి చేరుకున్నారు. బాధితుడి సోదరుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమకు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది కొర్లగుంట జంక్షన్ వద్ద కాపు కాచి అక్కడ వున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి వాహనం, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు.



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ వెంకటనారాయణ

కొట్టుకుపోయిన భూపతీశ్వర ప్రాజెక్టు అక్విడెక్ట్



సత్యవేడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీకోట సమీపంలోని భూపతీశ్వర ప్రాజెక్టు కింద నిర్మించిన అక్విడెక్ట్ ఇటీవల వర్షాలకు కొట్టుకు పోయింది. దీంతో 500 ఎకరాల ఆయకట్టుకు ఈ సారి నీరందని పరిస్థితి నెలకొంది. అక్విడెక్ట్ నుంచి వచ్చిన నీటితో చెరువులు నిండితేనే పంటలు పండేవి. అక్విడెక్ట్ కుప్పకూలడంతో బీరకుప్పం, కడివేడు చెరువులకు రావాల్సిన నీరు రాళ్లవాగు మీదుగా సముద్రంలో కలిసిపోతోంది. ఆక్రమణదారుల వల్లే అక్విడెక్ట్ కూలిందని రైతులు ఆరోపించారు. గతేడాది చెన్నైకు చెందిన వ్యక్తి ప్రాజెక్టు దిగువన భూములను కొని చెంగాల్వను ఆక్రమించారు. స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి భూములు ముంపునకు గురి కాకుండా ప్రాజెక్టు రెండో తూము వద్ద ఎక్స్‌కవేటర్లతో లోతుగా కాలువ తీసి ప్రవాహ దిశను అక్విడెక్ట్ వైపు మళ్లించారు. దీంతో ప్రవాహ వేగం పెరిగి అక్విడక్ట్ కింద భాగం కోతకు గురై కొట్టుకు పోయిందని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం వీటిని వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై విజయవాడ నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇతర అధికారులు బుధవారం వర్చువల్ విధానంలో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామాన్నీ సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22ఏకు సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులు స్వీకరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 50 శాతం రెవెన్యూ సమస్యలు ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 1,051 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంటుందని, జేసీ సమన్వయకర్తగా ఉంటారని, ఆర్డీవోలు తమ పరిధిలోని మండలాల్లో సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్డీసీ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చంద్రబాబుతోనే మాదిగల అభివృద్ధి

● మందకృష్ణపై విమర్శలు చేస్తే సహించం ● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడితోనే మాదిగలు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తున్న ఆయన పట్ల మాదిగలు అత్యంత విశ్వాసంతో ఉన్నారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయం మేరకు రాజ్యాంగబద్ధంగా ఎస్సీ ఎస్టీలు సమానత్వంతో రిజర్వేషన్లు పొందాలని 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారేగానీ మాలలకు వ్యతిరేకం కాదన్నారు. కొందరు రాజకీయ లబ్ధికోసం మాల సోదరులను తప్పుదోవ పట్టిస్తూ మందకృష్ణ మాదిగపై విమర్శలు చేస్తే సహించమన్నారు. ఆ మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. బీసీల్లో ఉన్న వర్గీకరణ ఎస్సీల్లో ఉంటే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఆగస్టు1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు కట్టుబడి రాజ్యాంగ బద్ధంగా మాలమాదిగలు కలిసి సమానత్వం కోసం కలిసిరావాలన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వర్గీకరణ ఆగదని, మీకు అన్యాయం జరిగినా మందకృష్ణ మాదిగ అండగా ఉంటారనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ప్రభుత్వం స్పందించి వర్గీకరణ పూర్తి చేసి నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌మాదిగ, ఎంఎస్పీ నాయకులు నరేంద్రమాదిగ, రామకృష్ణ, గోపి, రాజేంద్ర, వాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.90కోట్లు



శ్రీకాళహస్తి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,90,5,265 వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గత నెల 6 నుంచి ప్రధాన, పరివార దేవతల వద్ద హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. ఇందులో ఇంకా 106 గ్రాముల బంగారు, 466.100 కిలోల వెండి, 121 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు.

'వాహన్'లోనే ఆర్టీఏ సేవలు

తిరుపతి (రవాణా),డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇకపై రవాణా శాఖ సేవల కోసం 'వాహన్' సాఫ్ట్‌వేర్‌ను మాత్రమే వాడాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ బుధవారం తెలిపారు. 'ఈ ప్రగతి' సాఫ్ట్‌వేర్ ఇక అందుబాటులో ఉండదన్నారు. వాహన రిజిస్ట్రేషన్‌కు 'వాహన్‌డాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్, లైసెన్సు సేవల కోసం 'సారథిడాట్‌పరివాహన్‌డాట్‌జీవోవీడాట్‌ఇన్'లో లాగిన్ కావాలని సూచించారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 62 కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తిరుపతిలోని ఆర్సీ రెడ్డి, గాయత్రి కాలేజీలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీ చేశారు.

8న 'రన్ ఫర్ తిరుపతి'



'రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. శాప్, ఈగల్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా చేపట్టే ఈ కార్యక్రమానికి బుధవారం ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు బ్రోచర్లను విడుదల చేశారు. 10 కిలోమీటర్ల పరుగు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.60 వేల విలువ చేసే నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రాఘవీణ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేయాలా?

● 94404 46130 నెంబరుకు కాల్ చేయండి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వెళుతున్నారా? మిమ్మల్ని ఎవరైనా డబ్బులు అడిగితే 94404 46130 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జిల్లాలో అవినీతి అధికారుల భరతం పట్టడానికి సామాన్యులు ముందుకు రావాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు. దీనికోసం త్వరలో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీబీ అదనపు ఎస్పీ విమలకుమారి తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. ఇక, సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించింది. రూ.3.32 కోట్లు ఆదాయం లభించినట్టు బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 60,301 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 20,222 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి: పాశం


విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పేదల నివాస గృహాలపై నుంచి విద్యుత్‌తీగలు వెళుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లకుండా మార్చాలన్నారు. ప్రస్తుతం వరిసాగు చేపడుతున్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేకుండా చూడడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఈఈ నరేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, నాయకులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో అభివృద్ధి పరుగులు


తిన్నెలపూడిలో సభ్యత్వం చేయిస్తున్న సుష్మారెడ్డి తదితరులు

కోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్క కండ్రిగ, రంగన్నగుంట, నారుమిట్ట గ్రామాల్లో బుధవారం తెలుగు మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గూడూరు నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిరంజీవి, రాజేష్, సురేష్, పవన్ తదితరులు ఉన్నారు.

మైనింగ్ అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ ద్వారా వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా మైనింగ్ ద్వారా వేల కోట్లు రూపాయలు దోచుకున్నవారికి కూటమి ప్రభుత్వం మైనింగ్ అనుమతులు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఈ చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన మాధవ నాయుడు


లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో మాధవ నాయుడు, ఎంపీ అప్పలనాయుడు

దక్కిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, అండమాన్ నికోబార్ దీవుల ఇన్‌చార్జి వెంపటి మాధవనాయుడు బుధవారం కలిశారు. విజయనగరం ఎంపీ అప్పల నాయుడు, రీకన్ ఇంటర్నేషనల్ చారిటుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ కలువ చంద్రశేఖరరావుతో పాటు లోక్‌సభ స్పీకర్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన మాధవనాయుడు వెంకటేశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. విజయనగరం ఎంపీ అప్పల నాయుడు ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత పైడితల్లి అమ్మవారి జాతర విశిష్టను స్పీకర్‌కు వివరించారు. పైడితల్లి అమ్మవారి జాతరకు హాజరుకావాలని స్పీకర్‌ను ఆహ్వానించారు.

శ్రీవారి సేవలో ఇస్రో బృందం

పీఎస్ఎల్వీ సీ 59 నమూనాకు ప్రత్యేక పూజలు


ఆలయం ముందు ఇస్రో బృందం

తిరుమల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): ఇస్రో అధికారుల బృందం బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. శ్రీహరికోట షార్‌లో ప్రతి ప్రయోగానికీ ముందు ఇస్రో అధికారుల బృందం నమూనాతో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పీఎస్ఎల్వీ సీ 59 నమూనాతో అధికారుల బృందం బుధవారం వేకువజామున సుప్రభాత సేవలో స్వామి పాదాల వద్ద నమూనాను ఉంచి ప్రత్యేక పూజలు చేయించి, శ్రీవారిని దర్శించుకుంది. బృందంలో ఎస్ఎస్ఐఎల్ చైర్మన్, ఎండీ డాక్టర్ రాధాకృష్ణన్, డిప్యూటీ సెక్రటరీ పద్మజ్యోతి, సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్తా ఉన్నారు. అలాగే సూళ్లూరు పేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ విజయవంతం కావాలని పూజలు చేశారు. కార్యక్రమంలో షార్ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
విద్యానగర్ శాఖ, ఫోన్: 63027 64585

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు గడువు దాటిన తర్వాత కూడా పలు నోటీసులు పంపినా అప్పు చెల్లించియుండలేదు. సదరు నోటీసులు పంపినప్పటికీ ఖాతరు చేయనందున నోటీసు వారికి చేరక వాపసు వచ్చినందున నగలు విడిపించుకోలేక పోయినందున వారి బకాయి రాబట్టుకొనుటకు బ్యాంకు నిబంధనలను అనుసరించి **తేది:19-12-2024 గురువారం మ॥2 గం॥లకు** బ్యాంకు ఆవరణములో బహిరంగముగా వేలము ద్వారా సదరు నగలు విక్రయించి అప్పుకు జమ చేయబడును.

షరతులు: 1. ఇది వరకు నోటీసు చేరని వారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. 2. ఈ ప్రకటన ఖర్చు అప్పుదారుడే భరించవలెను. 3. వేలములో పాల్గొనదలచిన వారు రూ.10,000/- ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. 4. వేలము పొందినవారు మిగిలిన సొమ్ము వెంటనే చెల్లించి నగలు స్వాధీనము చేసుకోవలెను. లేనిచో ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. 5. మరణించిన ఋణగ్రహీతల సంబంధీకులకు కూడా ఈ నోటీసు వర్తించును. 6. వేలం నిర్వహణపై సర్వాధికారములు బ్యాంకు మేనేజరు పరిధిలో ఉండును.

వ.నెం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు/చిరునామా	బంగారం గ్రాములలో
1.	40612375489	యనమల దనమ్మ భర్త రవణయ్య, కొండాపురం, వడ్డిపాళెం, వాకాడు మండలం	72.40

సం/- బ్రాంచి మేనేజర్, విద్యానగర్ శాఖ

వదలని వాన


సూళ్లూరుపేటలోని జీఎస్‌టీ రోడ్డులో వర్షపునీరు

నాయుడుపేట టౌన్, పెళ్లకూరు, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వెంకటగిరి టౌన్, ఓజిలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను తీరం దాటినప్పటికీ వానలు వీడలేదు. బుధవారం నాయుడుపేటలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరపిలేని వర్షం కురిసింది. పట్టణంలో ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ● పెళ్లకూరు మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు ఎటువంటి గాలులు లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు, స్వర్ణముఖినది ఉధృత్తంగా ప్రవహిస్తున్నాయి. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు నిండుకుండల్లా మారాయి. ప్రస్తుత వర్షాలతో చెరువులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● సూళ్లూరుపేటలో బుధవారం ఉదయం 8నుంచి 11 గంటల వరకు రెండు గంటల పాటు భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలయమంగా మారాయి. జీఎస్‌టీ రోడ్డుపై వర్షపునీరు నిలవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల కురిసిన వర్షం ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రావడంతో నిండుకుండను తలిపిస్తున్న పులికాట్ సరస్సులో అలలు సముద్రాన్ని తలిపిస్తున్నాయి. నెర్రికాలువ, పుచ్చాకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఫెంగల్ తుపాన్ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటుండగా మళ్లీ వర్షం రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ● దొరవారిసత్రం మండలాన్ని బుధవారం వర్షం ముంచెత్తింది. ఉదయం 9 గంటలకు మొదలైన వర్షం మధ్యాహ్నం 3గంటల వరకు విడవకుండా కురిసింది. కాళంగి నదితో పాటు, ప్రధానమైన నెర్రికాలువ, పాలకాలువ, కన్నాకాలువ, పుచ్చకాలువలు వరద నీటి ప్రవాహంతో ఉధృతంగా సాగుతున్నాయి. వర్షాలు ఎక్కువైతే మండలంలో పలు చెరువుల కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● వెంకటగిరి మండలంలో బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. అన్ని కాలువలు, చెరువుల్లో నీరు చేరింది. మరో రెండు రోజులు పాటు వర్షం కురిస్తే చెరువులు పూర్తిగా నిండి వ్యవసాయానికి సాగునీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ● ఓజిలిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జల్లులతో కూడిన వర్షం పడింది. దీంతో వీధులన్నీ బురదమయంగా మారాయి. ఎల్డి పైర్లకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.


దొరవారిసత్రం: ఉధృతంగా ప్రవహిస్తున్న నెర్రికాలువ


నాయుడుపేటలో చెరువులా మారిన చిన్నదర్గా వీధి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: డ్వామా పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు చేపడుతామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులను వేగవంతంగా నిర్వహించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వహించడంలేదని ఫిర్యాదులుఅందుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి విధుల్లో అలసత్వం వహించేవారిపై చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ముగిసిన వెంటనే గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన దొరవారిసత్రం మండల కార్యాలయ సమావేశ మందిరంలో సూళ్లూరుపేట నియోజవర్గంలోని ఆరు మండలాల ఉపాధి ఏపీవోలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉపాధి పనులు మందకోడిగా సాగుతున్నాయన్నారు. నియోజకవర్గానికి మంజూరు చేసిన 75 గోకులాల షెడ్లను వెంటనే నిర్మింపజేయాలని సూచించారు. అలాగే సిమెంటు రోడ్ల పనులు పూర్తి చేయించాలన్నారు. ఉపాధి పనుల్లో జిల్లాలో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండేలా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏపీడీ వరప్రసాద్ పాల్గొన్నారు.

వర్షంలోనూ తప్పని ట్రాఫిక్ సమస్యలు


గాంధీ మందిరం పార్కు వీధిలో ఆగిపోయిన వాహనాలు

నాయుడుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ నాయుడుపేటలో ట్రాఫిక్ సమస్యలు తప్పడంలేదు. బుధవారం పట్టణంలోని గాంధీ మందిరం పార్కు వీధిలో వాహనాల రాకపోకలతో రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్య నెలకొంది. ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు వర్షానికి తడుస్తూ ఇబ్బందులకు గురయ్యారు.

ఉద్యాన పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడండి

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి తెలిపారు. బుధవారం ఉచ్చూరు, తనియాలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉచ్చూరులో ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులకు పలు సూచనలు చేశారు. మిరప, కూరగాయలు, పూలతోటల్లో నీరు లేకుండా చూడాలన్నారు. వేరు కుళ్లు, ఎండు తెగులు రాకుండా మొక్కల మొదళ్లలో 2 గ్రాముల రిడోమిల్‌ను 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే 13-0-45, 19-19-19 మందును లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున నీటిలో కలుపుకొని పంటలపై పిచికారీ చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు

గూడూరు, తడ, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ప్రధానంగా సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ మధ్య పోటీ నెలకొంది. బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు ఎన్నికలు జరగనున్నాయి. గూడూరు రైల్వేస్టేషన్‌లో ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ● అదేవిధంగా సూళ్లూరుపేట, నాయుడుపేటలో రైల్వే యూనియన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8గంటలకు మొదలైన పోలింగ్ సాయింత్రం 6 గంటల వరకు కొనసాగింది. సూళ్లూరుపేట పోలింగ్ కేంద్రంలో 197మంది, నాయుడుపేటలో 154 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆర్టీసీ స్టాఫ్ అండ్‌వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను పరిష్కరించడంలో డిపో మేనేజర్ కొన్ని యూనియన్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కొన్ని యూనియన్‌లకు చెందిన కార్మికులను సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఉన్నతాధికారులు విచారణ నిర్వహించిన అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, రాము, శ్రీధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా పోలమ్మ

బాలాయపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) బాలాయపల్లి మండల వెలుగు కార్యాలయం నూతన ఏపీఎంగా పోలమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండున్నరేళ్లుగా ఏపీఎం లేకపోవడంతో ఇన్‌చార్జిల పాలన కొనసాగింది. ఈ క్రమంలో వాకాడు మండలంలో పనిచేస్తున్న ఏపీఎం పోలమ్మను బాలాయపల్లికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

టీడీపీ నేతకు మాతృవియోగం


సీసీ నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ సీసీ నాయుడు మాతృమూర్తి చెన్నమనేని పార్వతమ్మ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంగమాంబపురంలో పార్వతమ్మ భౌతికాయానికి నివాళులర్పించారు. సీసీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాయి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై సర్వే

కోట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి, లక్ష్మక్క కండ్రిగ గ్రామాల్లో బుధవారం క్యాన్సర్‌పై సర్వే జరిగింది. ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశా వర్కర్ వెంకటరవణమ్మ ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి సర్వే చేపట్టారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

చిల్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అధైర్యపడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంపీడీవో గోపి అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో చిన్నారులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక తర్ఫీదు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు సనత్‌కుమార్, రఫూఫ్, ట్రస్ట్ సభ్యులు బాబు, ఉపాధ్యాయులు నాగరాజు, లలిత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో గోపి

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఓజిలి, పెళ్లకూరు, తడ, బాలాయపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 6నుంచి వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఓజిలి, పెళ్లకూరు, తడ, బాలాయపల్లి మండలాల తహసీల్దార్లు పద్మావతి, ద్వారకానాథ్‌రెడ్డి, శరత్‌బాబు, శ్రీనివాసులు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విషగుళికలు తిని యువకుడి మృతి


మృతి చెందిన సురేష్

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోసనూరు గిరిజన కాలనీకి చెందిన కదూరు సురేష్(17) విషగుళికలు తిని చెందాడు. స్థానికుల వివరాల మేరకు.... సురేష్ రెండు నెలల క్రితం రోసనూరు గిరిజన కాలనీ నుంచి చెంబేడు గిరిజన కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం అక్కడే తన సమీప బంధువుతో కలసి మద్యం తాగాడు. మద్యం మత్తులో విషగుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి పెళ్లకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండల పరిధిలోని 71వ జాతీయ రహదారిలో వంతెనపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. తిరుపతి స్విమ్స్‌కు చెందిన నలుగురు వైద్యులు కావలిలో జరిగే వివాహనికి కారులో వెళ్తుండగా నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న మరో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక మహిళతో పాటు మరో ముగ్గరికి గాయ్యాయ్యాయి. ఎస్ఐ నాగరాజు, అటుగా వెళ్తున్న నాయుడుపేట కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పరామర్శ

పెళ్లకూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, హరిబాబురెడ్డిలను టీడీపీ నేత తానంకి నానాజీ పరామర్శించారు. ఇటీవల మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి మృతి చెందారు. బుధవారం కర్మక్రియలు జరిగాయి. ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

ఎన్‌బీకేఆర్‌లో నేవీ దినోత్సవం



కోట, డిసెంబరు 4: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం భారత నౌకా దినోత్సవం వేడుకలను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి ప్రారంభించారు. నావెల్ యూనిట్ ఇన్‌చార్జ్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు నిర్వహించారు.

విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్షలు

నాయుడుపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలో 3, 9 తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) టెస్టులను బుధవారం నిర్వహించారు. నాయుడుపేటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గురుకుల ఉన్నత పాఠశాల, పుదూరు జడ్పీ ఉన్నత పాఠశాల, రాజగోపాల పురంలోని ఎంపీపీఎస్, జనరల్ పాఠశాల, నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాల, సెయింట్ మేరీస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల, జాక్‌అండ్‌జిల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఏఎస్‌వో సారధి, ఏవో గోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ ఏఎంవో, ఎంఈఈ మునిరత్నం పరీక్షలను పర్యవేక్షించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గిరిజన గురుకులం, కోటలోని బీసీ గురుకులం, విద్యానగర్‌లోని బాలభారతి, కోటలోని ప్రగతి, శ్రీచైతన్య పాఠశాలల్లోని 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 180మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎంఈవో మస్తానయ్య పరీక్షలను పర్యవేక్షించారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాన చేస్తున్న విద్యార్థులు

గూడూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానం సామాజిక బాధ్యత అని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఏరియా ఆస్పత్రి బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయమహేష్, డాక్టర్ పీరకుమార్, ఝాన్సీ, హిమబిందు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

దొరవారిసత్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో జాతీయ రహదారి వంతెనపై బుధవారం తెల్లవారుజామున నాయుడుపేట నుంచి సూళ్లూరుపేట వైపు వెళ్తున్న మినీ వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు.

పంటల బీమా పథకంపై అవగాహన సదస్సు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్

గూడూరు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాశాఖ ఏడీ గోపినాయక్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి, వేరుశనగ పంటలకు పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాసులు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

వెంకటగిరిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో సుజాత అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లివేడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామమోహన్, రాజ్యలక్ష్మి, భాస్కర్, వేణు, రైతులు పాల్గొన్నారు.